STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/26/A3949

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

సమయం

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 1 | సంచిక: 118 | ఎడిటర్ : అలీ ముర్తుజా | బుధవారం 11 నవంబర్ 2026 | ప్రచురణ : విజయవాడ | పేజీలు: 8 | వెల: రూ.5 |

జనవరిలో.. సహకార పోరు!

షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు



- వెంటనే అభివృద్ధి బాట పట్టాలి
- బియ్యం ధరలు తగ్గించాలి
- మంత్రులకు సీఎం దిశానిర్దేశం

2

19న ఎంపీపీ.. 20న జెడ్పీ చైర్ పర్సన్!

పరోక్ష ఎన్నికలకు నోటిఫికేషన్లు

కో-ఆప్టెడ్ సభ్యులకు ముందుగా ఎన్నిక

రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు

2





ఏపీకి.. భారీ పెట్టుబడులు!

అమనాంలో ఏఐ డేటా సెంటర్‌కు గ్రీన్‌సిగ్నల్

కార్బన్ కాస్మో బ్యాటరీ ప్లాంట్‌కు ఆమోదం

- భోగాపురంలో రిలయన్స్‌కు భూ కేటాయింపు
- ఏవీజీసీ, రోబోటిక్స్ పాలసీలకు ఆమోదం
- ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌కు ప్రత్యేక డైరెక్టరేట్
- 30కి పైగా కీలక అంశాలకు ఏపీ కేబినెట్ ఓకే
- కొత్త పారిశ్రామిక విధానాలకు ఆమోదముద్ర
- 2029 ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలి
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

2



విశాఖకు.. పారిశ్రామిక దిగ్గజాలు!

ముస్తాబైన సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్

కేంద్ర మంత్రులతో సీఎం కీలక భేటీ

బుధవారమే వైజాగ్‌కు చంద్రబాబు

డబ్ల్యూఐపీవో డైరెక్టర్ జనరల్‌తో చర్చలు

నోవోటెల్‌లో మహిళా సాధికారత సదస్సు

వివరాలు 2లో..

రాష్ట్రంలో పారిశ్రామిక విప్లవానికి నాంది పలుకుతూ ఏపీ కేబినెట్ చారిత్రక నిర్ణయాలు తీసుకుంది. లక్షల కోట్ల పెట్టుబడులు, లక్షలాది మందికి ఉద్యోగాలే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. పారిశ్రామిక పెట్టుబడులు, భూకేటాయింపులకు సంబంధించి ముప్పైకి పైగా అంశాలకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ముఖ్యంగా టెక్నాలజీ రంగానికి పెద్దపీట వేస్తూ.. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఏవీజీసీ-ఎక్స్‌ఆర్, రోబోటిక్స్, సెమీకండక్టర్లకు సంబంధించిన కొత్త పాలసీలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటుకు అంగీకరించారు. ఇలా పాలనలో వేగం పెంచుతూనే.. మరోవైపు మంత్రులకు సీఎం కీలక సూచనలు చేశారు.

-సమయం న్యూస్, అమరావతి

ఇంజినీరింగ్ కాలేజీల్లో.. నర్సింగ్ కొలువులు!

- ఎస్సీ నర్సింగ్ విద్యార్థినులకు శిక్షణ
- నెలకు రెండు లక్షల వేతనం
- ఆరు కేంద్రాల్లో ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్
- మంత్రి వీరాంజనేయస్వామి వెల్లడి
- పోటీ పరీక్షలకూ ఉచిత శిక్షణ

2



పోలీస్ బాస్‌ల సదస్సులో.. యోగా!

- శారీరక, మానసిక ఆరోగ్యం కోసం ప్రతిరోజూ 45 నిమిషాల సాధన : మంత్రి సత్యకుమార్

3

తండ్రి పేరు నిబంధన తొలగించాలి!



.. వివరాలు 3లో

తాత ఆస్తిపై.. మనవళ్లకు హక్కుల్లేవు!

- పుట్టుకతోనే వాటా వస్తుందనుకోవడం పొరపాటు
- తండ్రికి వారసత్వంగా వచ్చిన ఆస్తి ఆయన వ్యక్తిగతమే
- ఆ ఆస్తి విక్రయాన్ని అడ్డుకునే హక్కు ఎవరికీ లేదు
- హిందూ వారసత్వ చట్టం సెక్షన్ 8 ప్రకారం పంపకాలు
- కీలక తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు ధర్మాసనం

3




తీర భద్రతపై.. కీలక భేటీ!



మంత్రి నారా లోకేశ్‌తో ఐసీజీ కమాండర్ మొహపాత్ర సమావేశం

రాష్ట్ర తీరప్రాంత భద్రత, రక్షణ చర్యలపై సుదీర్ఘ చర్చ

2



నాలో నేనే.. యుద్ధం చేశా!

పిల్లల భయంతోనే నాడు ప్రధాని పదవికి దూరం : సోనియా గాంధీ

4

జనవరిలో.. సహకార పోరు!

షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు.. మంత్రులకు సీఎం దిశానిర్దేశం

వెంటనే అభివృద్ధి బాట పట్టాలి.. బియ్యం ధరలు తగ్గించాలి

అమరావతి, నవంబర్ 10 (సమయం న్యూస్): రాష్ట్రంలో వచ్చే ఏడాది జనవరి నెలలో సహకార సంఘాల ఎన్నికలను నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. సచివాలయంలో మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే సహకార సంఘాలు, సొసైటీ, పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి కాగానే పాలనను తిరిగి వేగంగా అభివృద్ధి మూడ్‌లోకి తీసుకెళ్లాలని మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఎన్నికల వాతావరణం ముగిసిన వెంటనే ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల అమలు, అభివృద్ధి పనుల వేగంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని సూచించారు. పాలనలో ఎక్కడా ఎలాంటి అలసత్వం ఉండకూడదని మంత్రులను ఆదేశించారు. నిత్యావసర వస్తువుల ధరలపైనా ఈ భేటీలో సీఎం సమీక్షించారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం మార్కెట్లో కూరగాయల ధరలు కొంత తగ్గుముఖం పట్టాయని ఆయన పేర్కొన్నారు. ఇదే రీతిలో బియ్యం ధరలు కూడా సామాన్యులకు అందుబాటులోకి వచ్చేలా, మరింత తగ్గేలా తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖ మంత్రులకు సీఎం సూచించారు. నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణపై అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.



19న ఎంపీపీ.. 20న జెడ్పీ చైర్ పర్సన్!

పరోక్ష ఎన్నికలకు నోటిఫికేషన్లు.. రాజకీయ పార్టీల విప్ తప్పనిసరి

14లోగా సభ్యులకు నోటీసులు..రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు

విజయవాడ, నవంబర్ 10 (సమయం న్యూస్) : రాష్ట్రంలోని మండల, జిల్లా పరిషత్‌ల పరోక్ష ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం మంగళవారం కీలక నోటిఫికేషన్లు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 659 మండల ప్రజా పరిషత్‌ల (ఎంపీపీలు) అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కో-ఆప్టెడ్ సభ్యుల పరోక్ష ఎన్నికలను నవంబర్ 19న నిర్వహించనున్నారు. అలాగే 28 జిల్లా ప్రజా పరిషత్‌ల (జెడ్పీపీలు) చైర్ పర్సన్లు, వైస్ చైర్ పర్సన్లు, కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికల కోసం నవంబర్ 20న ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. ఈ పరోక్ష ఎన్నికలకు సంబంధించిన నోటీసులను కొత్తగా ఎన్నికైన ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులకు ఈ నెల 14లోగా అందజేయనున్నారు. సంబంధిత ప్రిసైడింగ్ అధికారులు ఈ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తారు.



కో-ఆప్టెడ్ ఎన్నిక తర్వాతే..

కొత్తగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులు తమలో ఒకరిని మండల పరిషత్ అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు. అలాగే జెడ్పీటీసీ సభ్యులు జిల్లా పరిషత్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్‌ను ఎన్నుకోనున్నారు. అయితే ఈ ఎన్నికల కంటే ముందుగానే కో-ఆప్టెడ్ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. ప్రతి ఎంపీపీలో ఒకరిని, జెడ్పీపీలో ఇద్దరిని కో-ఆప్టెడ్ సభ్యులుగా ఎన్నుకుంటారు. మతపరమైన మైనారిటీలు (ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, పార్సీలు) లేదా తెలుగు మాతృభాష కాని భాషాపరమైన మైనారిటీ వర్గాలకు చెందినవారికి మాత్రమే ఈ కో-ఆప్టెడ్ పదవులు కేటాయించాలి.

పార్టీ విప్ జారీ తప్పనిసరి..

ఎంపీపీ అధ్యక్ష, ఉపాధ్యక్ష, జెడ్పీ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ పదవులకు జరిగే ఎన్నికలను సభ్యులు చేతులు పైకెత్తి ఓటు వేసే విధానంలో నిర్వహిస్తారు. ఈ ఎన్నికల్లో ఆయా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు తమ సభ్యులకు జారీ చేసే విప్‌ను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. అయితే కో-ఆప్టెడ్ సభ్యుల ఎన్నికలకు మాత్రం పార్టీ విప్ నిబంధన వర్తించదు. ఈ ఎన్నికల ప్రత్యేక సమావేశాలకు సంబంధిత మండల, జిల్లా పరిషత్‌లకు ఎక్స్-అఫీషియో సభ్యులుగా ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆహ్వానితులుగా హాజరవుతారు. అయితే వారికి ఇక్కడ ఓటు వేసే హక్కు ఉండదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

పేదల ఉన్నతికే.. ఉచిత శిక్షణ!

విజయవాడ స్టడీ సర్కిల్‌లో మంత్రి ఆకస్మిక తనిఖీ

విద్యార్థులతో మాట్లాడిన డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

పేద విద్యార్థుల అభ్యున్నతే సీఎం చంద్రబాబు లక్ష్యం

సివిల్స్ అభ్యర్థులకు ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్

ట్యాబ్‌ల పంపిణీతో ఆన్‌లైన్ ద్వారా కూడా తర్ఫీదు

విజయవాడ, నవంబర్ 10 (సమయం న్యూస్) : పేద విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిరపడాలన్నదే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రధాన లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. విజయవాడలోని అంబేద్కర్ స్టడీ సర్కిల్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో ముఖాముఖి మాట్లాడి, వారికి అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పేద పిల్లలకు అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన విద్య, నైపుణ్యాలను అందించేందుకు కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని ఈ సందర్భంగా మంత్రి వెల్లడించారు. తిరుపతి, విజయవాడ, విశాఖపట్నంలోని అంబేద్కర్ స్టడీ సర్కిళ్లలో సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తున్నామని మంత్రి తెలిపారు. అలాగే మరికొంత మందికి ట్యాబ్‌లు పంపిణీ చేసి ఆన్‌లైన్‌లో సైతం కోచింగ్ ఇప్పిస్తున్నట్లు వివరించారు. మరోవైపు నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ, ఇజ్రాయెల్ భాషల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి విదేశాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని గుర్తుచేశారు. యువత, పేద విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అద్భుతమైన సౌకర్యాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. అహర్నిశలు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి, తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని విద్యార్థులకు ఆయన దిశానిర్దేశం చేశారు.

ఏపీకి.. భారీ పెట్టుబడులు!

- అమనాంలో ఏఐ డేటా సెంటర్‌కు గ్రీన్‌సిగ్నల్
- కార్బన్ కాస్మో బ్యాటరీ ప్లాంట్‌కు ఆమోదం
- 30కి పైగా కీలక అంశాలకు ఏపీ కేబినెట్ ఓకే
- కొత్త పారిశ్రామిక విధానాలకు ఆమోదముద్ర
- 2029 ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలి
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

అమరావతి, నవంబర్ 10 (సమయం న్యూస్): రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, యువతకు భారీగా ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంగళవారం వెలగపూడి సచివాలయంలో జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో 30కి పైగా అజెండా అంశాలకు ఆమోదం లభించింది. పారిశ్రామిక పెట్టుబడులు, ఏఐ డేటా సెంటర్లు, రోబోటిక్స్, సెమీకండక్టర్లు, విద్యుత్ ప్రాజెక్టులు, మహిళా పారిశ్రామిక పార్కుల ఏర్పాటుతో పాటు ఐటీ, రెవెన్యూ, హోంశాఖ ప్రతిపాదనలకు పచ్చజెండా ఊపింది. కొత్త పారిశ్రామిక విధానాలకు ఆమోదం తెలుపుతూనే.. పలు భారీ సంస్థలకు కేబినెట్ భూ కేటాయింపులు జరిపింది.

కొత్త పాలసీలకు గ్రీన్ సిగ్నల్..

రాష్ట్రంలో సాంకేతిక, పారిశ్రామిక విప్లవానికి నాంది పలుకుతూ 2026ఉ2031 కాలానికి గాను ఏపీ ఏవీజీసీఉ ఎక్స్‌ఆర్ పాలసీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా 2036 వరకు అమల్లో ఉండేలా ఏపీ రోబోటిక్స్, ఫిజికల్ ఏఐ పాలసీ ప్రతిపాదనలకు అంగీకారం తెలిపింది. అలాగే సెమీకండక్టర్ అండ్ డిస్‌ప్లే ఫ్యాబ్ పాలసీఉ 4.0లో పలు సవరణలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అదానీ క్లౌడ్ హబ్ ప్రతిపాదన పరిశీలనకు మంత్రులు ఆమోదం తెలిపారు. రాథీ గ్రీన్ ఎనర్జీకి ఎర్లీ బర్డ్ ఇన్సెంటివ్, న్యూజిలాండ్ ల్యాబోరేటరీస్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

లక్షల కోట్ల పెట్టుబడులు ఇలా..

రాష్ట్రానికి తరలివస్తున్న భారీ పెట్టుబడులకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. విశాఖ జిల్లా అమనాంలో ఏఎం ఇంటెలిజెన్స్ ఆధ్వర్యంలో రూ.31,387 కోట్లతో 512 మెగావాట్ల గ్రీన్ ఇంటిగ్రేటెడ్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు పచ్చజెండా ఊపింది. నాయుడుపేటలో రూ.4,000 కోట్లతో కార్బన్ కాస్మో బ్యాటరీ మెటీరియల్ తయారీ ప్లాంట్ ఏర్పాటుకు మార్గం సుగమం చేసింది. తిరుపతిలో రూ.700 కోట్లతో డిక్సన్ టెక్నాలజీస్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ.570.20 కోట్లతో ఈపాక్ ఏఐ డేటా సెంటర్ పరికరాల తయారీ యూనిట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీని ద్వారా 2,565 మందికి ఉపాధి లభించనుంది. పశ్చిమ గోదావరిలో రూ.236.92 కోట్లతో రవళి స్పిన్నర్స్ విస్తరణకు కేబినెట్ అంగీకరించింది.

భూ కేటాయింపులు, పార్కుల ఏర్పాటు..

భోగాపురంలో రిలయన్స్ గిగా స్కేల్ ఏఐ డేటా సెంటర్‌కు 25 ఎకరాల భూమి, నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్కులో హెటిరో సంస్థలకు 173.82 ఎకరాలు కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. జగ్గయ్యపేట (జయంతిపురం)లో మహిళా పారిశ్రామికవేత్తల కోసం 30 ఎకరాల్లో ఎఫ్ఎల్‌వో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. అన్నమయ్య జిల్లాలో 56.82 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ ఫుట్‌వేర్ కాంపోనెంట్ పార్కు, తంబళ్లపల్లెలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు అంగీకరించింది. పెనుకొండలో ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు రెండు ఎకరాలు, రాజధాని పరిధిలోని శాఖమూరులో కేంద్రీయ విద్యాలయానికి భూ కేటాయింపులు జరిపింది. నాయుడుపేట సెజ్‌లో గతంలో వెబ్‌సోల్ రెన్యూపబుల్స్, మెట్రో డెకరేటివ్ సంస్థలకు కేటాయించిన భూముల రద్దుకు సైతం ఆమోదం తెలిపింది.

ఇంధన రంగంలో కీలక నిర్ణయాలు..

తాడిపత్రిలో 119 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టుకు, విజయవాడలో 15 మెగావాట్ల వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ఏర్పాటుకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రకాశం, ఎన్టీఆర్ జిల్లాల్లో బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. అనంతపురం జిల్లా వజ్రకరూరులో 192.68 ఎకరాల వక్ఫ్ భూమిని సౌర విద్యుత్ ప్రాజెక్టుకు ముప్పై ఏళ్ల లీజుకు ఇవ్వడానికి ఆమోదించింది. థర్మల్ విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా రాష్ట్రంలో ఎస్ఎంఆర్ సాంకేతికతతో అణు విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు సాధ్యాసాధ్యాల పరిశీలనకు అంగీకరించింది. రాష్ట్రంలో ట్రాఫిక్ నియంత్రణ, రహదారి ప్రమాదాల నివారణ కోసం పోలీసు శాఖలో డీజీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక 'ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ సేఫ్టీ డైరెక్టరేట్' ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మంగళగిరి పోలీసు ప్రధాన కార్యాలయంలో ఐజీ స్థాయి అధికారి నేతృత్వంలో ఈ కొత్త విభాగాన్ని ఏర్పాటు చేయనున్నారు. తిరుమల శ్రీవారి ఆలయంలో 'ప్రధాన సన్నిధి యాదవ', 'సన్నిధి యాదవ' పోస్టుల సృష్టికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.



విజయగర్వాన్ని తలకెక్కించుకోవద్దు: సీఎం

మంత్రివర్గ సమావేశం ముగిశాక రాజకీయ అంశాలపై సీఎం చంద్రబాబు మంత్రులతో చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధించిన విజయగర్వాన్ని తలకెక్కించుకోవద్దని ముఖ్యమంత్రి సూచించారు. ప్రతి ఒక్కరూ మరింత బాధ్యతతో 2029 ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రజలు ఎంతో స్పష్టమైన తీర్పునిచ్చారని, ఎక్కడైనా తేడాలు జరిగితే దానికి మనవాళ్లే కారణమని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని మోదీ, జనసేనాని పవన్ కల్యాణ్ సహకారంతోనే కూటమి అద్భుత విజయం సాధించిందని గుర్తుచేశారు. ప్రజలకు మేలు చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

లక్షల మందికి ఉపాధి..

రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు, ఉద్యోగావకాశాలు వెల్లువెత్తుతున్నాయని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఇప్పటివరకు రాష్ట్రానికి రూ.31 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, మరో రూ.10.50 లక్షల కోట్ల పెట్టుబడులు రాబోతున్నాయని తెలిపారు. వీటి ద్వారా 10.75 లక్షల మందికి ఉద్యోగాలు లభిస్తాయని, భవిష్యత్తులో మొత్తం 25 లక్షల ఉద్యోగాల కల్పనకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని పేర్కొన్నారు. డ్వాక్రా, మెప్మా విభాగాల్లో ఏపీ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని ప్రశంసించారు. మరోవైపు సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పుగా ఫిబ్రవరి మూడో తేదీన రాష్ట్రంలో క్వాంటం కంప్యూటర్‌ను ప్రారంభించనున్నామని, ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీని ఆహ్వానిస్తున్నట్లు చంద్రబాబు ఈ సందర్భంగా ప్రకటించారు.

విశాఖకు.. పారిశ్రామిక దిగ్గజాలు!

- ముస్తాబైన సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్
- కేంద్ర మంత్రులతో సీఎం కీలక భేటీ
- బుధవారమే వైజాగ్‌కు చంద్రబాబు
- డబ్ల్యూఐపీవో డైరెక్టర్ జనరల్‌తో చర్చలు
- నోవోటెల్‌లో మహిళా సాధికారత సదస్సు

అమరావతి, నవంబర్ 10 (సమయం న్యూస్): రాష్ట్రాన్ని పారిశ్రామికాభివృద్ధికి ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌కు విశాఖపట్నం సర్వం సిద్ధమైంది. ఈ నెల 12, 13వ తేదీల్లో జరగనున్న ఈ సదస్సు కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒకరోజు ముందుగానే బుధవారం విశాఖకు చేరుకోనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సుకు ప్రపంచం నలుమూలల నుంచి ప్రభుత్వ ప్రతినిధులు, దౌత్యవేత్తలు, బహుళజాతి సంస్థల అధినేతలు హాజరుకానున్నారు. సింగపూర్, యూఏఈ, జపాన్, రష్యా, స్లోవేకియా, గ్వాటెమాల తదితర దేశాల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించనున్నారు. ఇప్పటికే నిర్వహించిన ఐదు ప్రాంతీయ సదస్సుల ద్వారా ఏకంగా రూ.86 వేల కోట్ల పెట్టుబడులు రావడంతో.. ఈ అంతర్జాతీయ సమ్మిట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. నవంబర్ 12వ తేదీ ఉదయం విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ ప్రాంగణంలో ఈ సదస్సు అట్టహాసంగా ప్రారంభం కానుంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరై సదస్సును ప్రారంభిస్తారు. ఆ తర్వాత జరిగే వివిధ సమావేశాల్లో సీఎం చంద్రబాబు పాల్గొని పారిశ్రామిక వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వివరిస్తారు. ఈ రెండు రోజుల పాటు కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, పీయూష్ గోయల్, చిరాగ్ పాశ్వాన్, ప్రహ్లాద్ జోషి, సర్బానంద సోనోవాల్‌లతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా భేటీ కానున్నారు. రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి కేంద్రం నుంచి రావాల్సిన సహకారం, వివిధ వర్గాలకు కల్పించాల్సిన వెసులుబాట్లపై వారితో లోతుగా చర్చించనున్నారు.

ఒకరోజు ముందే ముమ్మర కసరత్తు..

సమ్మిట్‌కు ఒకరోజు ముందుగానే సీఎం చంద్రబాబు వరుస సమావేశాలతో బిజీ కానున్నారు. బుధవారం అమరావతిలో సింగపూర్ మంత్రి గాన్ సియో హువాంగ్‌తో సమావేశమైన అనంతరం ఆయన నేరుగా విశాఖ చేరుకుంటారు. అక్కడికి చేరుకోగానే ప్రపంచ మేధోసంపత్తి సంస్థ (డబ్ల్యూఐపీవో) డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్, జపాన్ రాయబారి కీచి ఒనో, యూఏఈ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీ, రెన్యూ సంస్థ సీఈవో సుమంత్ సిన్హాలతో సమావేశమవుతారు. సాయంత్రం సీఐఐ సీఈవోలతో భేటీ, అంతర్జాతీయ ప్రతినిధుల స్వాగత విందులో పాల్గొంటారు. ఈ సదస్సులో ఆటోమొబైల్, మౌలిక సదుపాయాలు, తయారీ రంగాలతో పాటు ప్రత్యేకంగా స్పేస్ (అంతరిక్ష) రంగంపై ఫోకస్ పెట్టనున్నారు. రాష్ట్రంలో పెట్టుబడుల లక్ష్యంగా ప్రైవేటు అంతరిక్ష సంస్థలైన హాథోర్ రాకెట్స్, అగ్నికుల్, బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్, స్కైరూట్ ప్రతినిధులతో సీఎం భేటీ అవుతారు. కియా మోటార్స్, మాండెలెజ్ ఇండియా, సెయింట్ గోబెయిన్, నాల్కో, లెవిస్టా సంస్థల అధినేతలు కూడా పాలుపంచుకోనున్నారు. మరోవైపు మహిళా సాధికారతకు ప్రాధాన్యమిస్తూ విశాఖ నోవోటెల్‌లో 'ఏమెన్ అండ్ గ్రోత్ సమ్మిట్-2026' పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. మహిళల ఆర్థిక సాధికారత, వ్యాపారవేత్తలుగా వారి ప్రోత్సాహంపై జరిగే ఈ సదస్సులో సైతం సీఎం చంద్రబాబు పాల్గొంటారు.



ఇజ్రాయెల్‌లో.. నర్సింగ్ కొలువులు!

- ఎస్సీ నర్సింగ్ విద్యార్థినులకు శిక్షణ
- నెలకు రెండు లక్షల వేతనం
- ఆరు కేంద్రాల్లో ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్
- మంత్రి వీరాంజనేయస్వామి వెల్లడి
- పోటీ పరీక్షలకూ ఉచిత శిక్షణ



విజయవాడ, నవంబర్ 10 (సమయం న్యూస్): ఎస్సీ యువతకు నైపుణ్య శిక్షణ అందించి, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. మంగళవారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఇజ్రాయెల్ నర్సింగ్ ట్రైనింగ్ వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏఎన్ఎం, జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన ఎస్సీ మహిళలకు పీఎం అజయ్ కార్యక్రమంలో భాగంగా మూడు నెలలపాటు ఉచితంగా రెసిడెన్షియల్ నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఏపీ ఎస్సీ కార్పొరేషన్, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు.

రూ.2 లక్షల జీతంతో ఉద్యోగాలు..

తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 1,100 మందికి ఈ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. విశాఖపట్నం, రాజమండ్రి, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు కేంద్రాలుగా ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఇజ్రాయెల్‌లో నెలకు సుమారు రూ.2 లక్షల వేతనంతో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన భరోసా ఇచ్చారు. ఇప్పటికే 300 మందికి జర్మన్ భాషలో తర్ఫీదు ఇచ్చామని, వారికి జర్మనీలో ఉపాధి కల్పించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఎస్సీ విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

పోటీ పరీక్షలకూ ఉచిత కోచింగ్..

ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు గ్రూప్స్‌తో పాటు డీఎస్సీ, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్ తదితర పోటీ పరీక్షలకు సైతం ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు వీరాంజనేయస్వామి చెప్పారు. డీఎస్సీ ఉచిత శిక్షణ ద్వారా 400 మంది ఉద్యోగాలు సాధించారని ఆయన హర్షం వ్యక్తం చేశారు. పేద ప్రజల తలసరి ఆదాయం పెంచి, రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించాలన్నదే సీఎం చంద్రబాబు సంకల్పమన్నారు. ఈ కార్యక్రమంలో మాల కార్పొరేషన్ చైర్మన్ పి.విజయ్ కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం.ఎం.నాయక్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి తేజ్ భరత్, ఎస్సీ కార్పొరేషన్ జీఎం చెన్నయ్య, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధులు, వివిధ జిల్లాల ఎస్సీ కార్పొరేషన్ ఈడీలు పాల్గొన్నారు.

తీర భద్రతపై.. కీలక భేటీ!

- మంత్రి నారా లోకేశ్‌తో ఐసీజీ కమాండర్ మొహపాత్ర సమావేశం
- రాష్ట్ర తీరప్రాంత భద్రత, రక్షణ చర్యలపై సుదీర్ఘ చర్చ
- విపత్తుల వేళ మత్స్యకారుల రక్షణకు ఉమ్మడి కసరత్తు
- ఇండియన్ కోస్ట్ గార్డ్‌కు రాష్ట్ర సర్కార్ పూర్తి సహకారం
- డీఐజీకి స్పష్టమైన హామీ ఇచ్చిన మంత్రి నారా లోకేశ్



అమరావతి, నవంబర్ 10 (సమయం న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం, భారతీయ తీర రక్షక దళం (ఐసీజీ) మధ్య సమన్వయం, పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసే దిశగా మంగళవారం కీలక భేటీ జరిగింది. ఆంధ్రప్రదేశ్ ఐసీజీ జిల్లా (నం. 6) కమాండర్, డీఐజీ పి.డి. మొహపాత్ర.. రాష్ట్ర ఐటీ, కమ్యూనికేషన్స్, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేశ్‌ను అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో తీరప్రాంత భద్రత అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. దాదాపు 974 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్‌లో సముద్ర రక్షణ ఎంతో కీలకమని ఈ సందర్భంగా ఇరువురు అభిప్రాయపడ్డారు.

మత్స్యకారుల రక్షణపై ఫోకస్..

తీరప్రాంతంలో నిఘా, సముద్రంలో చిక్కుకున్న మత్స్యకారుల రక్షణ, విపత్తుల సమయంలో సహాయక చర్యలపై ఇరువురు చర్చించారు. తుఫాన్లు, వరదలు లాంటి ప్రకృతి విపత్తుల వేళ వేగంగా స్పందించడం, మత్స్యకారుల్లో భద్రతపై అవగాహన కల్పించడం వంటి అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి ఐసీజీ తన పూర్తి సహకారం అందిస్తుందని డీఐజీ మొహపాత్ర మంత్రికి తెలియజేశారు. తీరప్రాంత అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాల్లో ఐసీజీ భాగస్వామ్యం, యువతలో దేశభక్తి పెంపొందించే కార్యక్రమాలు, మత్స్యకార గ్రామాల్లో వైద్య శిబిరాలు, స్వచ్ఛ తీర కార్యక్రమాల్లో కలిసి పనిచేయాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ సానుకూలంగా స్పందించారు. తీరప్రాంత భద్రత కోసం, మత్స్యకారుల ప్రాణాల రక్షణ కోసం ఇండియన్ కోస్ట్ గార్డ్ అందిస్తున్న సేవలు కొనియాడదగ్గవని ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున కోస్ట్ గార్డ్‌కు అన్ని విధాలుగా సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అధికారులకు, సిబ్బందికి, మాజీ సైనికుల సంక్షేమానికి తమ వంతు సాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ముఖ్యంగా టెక్నాలజీ వినియోగం, కమ్యూనికేషన్ వ్యవస్థ బలోపేతం, విపత్తు నిర్వహణలో సమన్వయం వంటి అంశాల్లో ప్రభుత్వం ఐసీజీకి పూర్తి తోడుగా ఉంటుందని లోకేశ్ స్పష్టం చేశారు.

పోలీస్ బాస్‌ల సదస్సులో.. యోగా!

- శారీరక, మానసిక ఆరోగ్యం కోసం ప్రతిరోజూ 45 నిమిషాల సాధన
- ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో శిక్షణకు రాష్ట్ర సర్కార్ ఏర్పాట్లు
- జాతీయ స్థాయి నిపుణులతో కార్యక్రమం నిర్వహణ
- అధికారులతో మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్ష

అమరావతి, నవంబర్ 10 (సమయం న్యూస్): వచ్చే నెలలో తిరుపతిలో జరగనున్న అఖిల భారత డీజీపీ–ఐజీపీ సదస్సులో యోగాకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆశయానికి అనుగుణంగా యోగాను నిత్యజీవితంలో భాగం చేసే ఉద్దేశంతో ఈ సదస్సులో మూడు రోజుల పాటు ప్రత్యేక యోగా సాధన నిర్వహించనున్నారు. విధి నిర్వహణలో నిరంతరం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొనే పోలీసు ఉన్నతాధికారుల శారీరక దృఢత్వం, మానసిక ఏకాగ్రత పెంపొందించేలా రాష్ట్ర ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ యోగా సాధన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం అధికారులతో సమీక్షించారు.



ప్రధాని, హోంమంత్రి రాక..

డిసెంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు తిరుపతిలోని ఐఐఎస్ఈఆర్ ప్రాంగణంలో అఖిల భారత డీజీపీ–ఐజీపీ సదస్సు జరగనుంది. ఈ సమావేశానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సహా పలువురు ప్రముఖులు, దేశవ్యాప్తంగా ఉన్న పోలీసు ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. ఇంతటి ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి సమావేశంలో యోగా కార్యక్రమాలను భాగం చేయడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిపై విస్తృత అవగాహన కల్పించనున్నారు.

కామన్ యోగా ప్రొటోకాల్ ప్రకారం..

సదస్సులో ప్రతిరోజూ ఉదయం ప్రశాంత వాతావరణంలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రూపొందించిన 'కామన్ యోగా ప్రొటోకాల్' ప్రకారం 45 నిమిషాల పాటు సాధన సాగనుంది. ఇందులో యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం వంటి ప్రక్రియలు ఉండనున్నాయి. ఈ కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను రాష్ట్ర ఆయుష్ శాఖకు అప్పగిస్తూ ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ పరిధిలోని మొరార్జీ దేశాయ్ జాతీయ యోగా సంస్థతో పాటు అమరావతిలోని మంతెన ఆశ్రమం నుంచి ప్రత్యేక యోగా నిపుణుల బృందాలు ఈ శిక్షణా శిబిరంలో పాల్గొననున్నాయి.

జాతీయ సంస్థకు చెందిన నిపుణులతో..

ఈ యోగా కార్యక్రమాల నిర్వహణ కోసం మొరార్జీ దేశాయ్ జాతీయ సంస్థకు చెందిన పలువురు ప్రముఖులను యోగా శిక్షకులుగా, రాహుల్ సింగ్ చౌహాన్‌ను ఆంగ్ల వ్యాఖ్యాతగా నియమించారు. వీరితో పాటు మంతెన ఆశ్రమానికి చెందిన నిపుణుల బృందం యోగా ప్రదర్శన, సాధన కార్యక్రమాల్లో పాల్గొననుంది. యోగాపై ప్రధాని చూపుతున్న ప్రత్యేక ఆసక్తి నేపథ్యంలో ఈ సదస్సులో యోగా కార్యక్రమాలు అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

క్యాన్సర్ మందులపై.. కఠిన నిఘా!

- ధరల తగ్గింపు ప్రయోజనం ప్రతి రోగికీ చేరాలి
- కొరత సృష్టించేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- దుకాణాల్లో కొత్త ధరల జాబితాను ప్రదర్శించాలి
- అధికారులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలు
- ఆసుపత్రులు, మందుల దుకాణాలకు విధివిధానాల జారీ

అమరావతి, నవంబర్ 10 (సమయం న్యూస్): క్యాన్సర్ మందుల ధరలను కేంద్ర ప్రభుత్వం తగ్గించిన నేపథ్యంలో ఆ ప్రయోజనం రోగులకు పూర్తిస్థాయిలో అందేలా కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. మందుల లభ్యత, ధరల అమలుపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, ఆసుపత్రులు, మందుల దుకాణాల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు. పాత ధరలతో ముద్రించిన మందుల నిల్వలను సైతం తగ్గించిన ధరలకే విక్రయించాలని ఆయన పేర్కొన్నారు. అధిక ధరలకు విక్రయించడం, మందుల కొరత సృష్టించడం, అవసరానికి మించి నిల్వలు ఉంచడం వంటి అక్రమాలను తక్షణమే అరికట్టాలని ఆదేశించారు. దేశవ్యాప్తంగా 1364 క్యాన్సర్ నిరోధక ఔషధాల ధరలను కేంద్ర ప్రభుత్వం సోమవారం నుంచి తగ్గించింది. వీటిలో 671 బ్రాండ్ల ధరలు సగానికి పైగా తగ్గగా.. ఎంఆర్‌పీలో అత్యధికంగా 96.45 శాతం వరకు తగ్గింపు జరిగింది.

కొరత సృష్టిస్తే కఠిన చర్యలు..

కేంద్ర ప్రభుత్వం తగ్గించిన ఈ మందుల ధరల అమలుకు తగ్గట్లుగా రాష్ట్రంలో తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం కార్యదర్శి జి.వీరపాండియన్, ఔషధ నియంత్రణ శాఖ డైరెక్టర్ జనరల్ అరుణ్‌బాబు, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆసుపత్రులు, మందుల దుకాణాల్లో ఇప్పటికే ఉన్న క్యాన్సర్ మందులను సైతం తగ్గించిన ధరలకే విక్రయించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మందుల కొరత సృష్టించే వారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. క్యాన్సర్ చికిత్స అందించే ఆసుపత్రులు రోగులకు సూచించిన మందులను తగినంతగా అందుబాటులో ఉంచాలని మంత్రి చెప్పారు. ప్రతి ఔషధానికి సంబంధించి తగ్గించిన ధరతో కనీసం ఒక కంపెనీ మందు నిల్వ ఉండేలా చూడాలన్నారు. రోగులు సైతం తమ అవసరాలకు అనుగుణంగానే మందులను కొనుగోలు చేయాలని సూచించారు. అవసరానికి మించి భారీగా మందులు కొనుగోలు చేసి నిల్వ చేయడం వల్ల ఇతర ఆసుపత్రులు, రోగులకు మందులు అందకుండా పోతాయని మంత్రి పేర్కొన్నారు.

కొత్త ముద్రణ అవసరం లేదు..

మరోవైపు ఔషధ నియంత్రణ శాఖ డైరెక్టర్ జనరల్ అరుణ్‌బాబు జిల్లాలకు జారీ చేసిన విధివిధానాల్లో.. తగ్గించిన క్యాన్సర్ మందుల విక్రయాల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను స్పష్టంగా వివరించారు. ఆసుపత్రుల మందుల విక్రయ కేంద్రాల్లో, వెబ్‌సైట్లలో తయారీ కంపెనీలు పంపిన సవరించిన ధరల జాబితాను తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. పాత ధర ముద్రించిన మందుల ప్యాకెట్లను తిరిగి పంపాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అలాగని వాటిపై కొత్త ధర ముద్రించాల్సిన అవసరమూ లేదన్నారు. అయితే సవరించిన ధర లేదా ప్యాకెట్‌పై ముద్రించిన ధర.. ఈ రెండింటిలో ఏది తక్కువైతే ఆ ధరకు మాత్రమే విక్రయించాలన్నారు. ప్రతి మందుకు సంబంధించిన బ్రాండ్ పేరు, బ్యాచ్ సంఖ్య, గరిష్ఠ చిల్లర ధర, వసూలు చేసిన మొత్తం వివరాలతో కూడిన బిల్లును రోగులకు ఇవ్వాలని ఆదేశించారు. ఆసుపత్రుల మందుల విక్రయ కేంద్రాలు, క్యాన్సర్ చికిత్స విభాగాలు, డే కేర్ క్లినిక్‌లలో రోగుల హక్కులు, ఫిర్యాదుల విధానాన్ని తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రదర్శించాలని స్పష్టం చేశారు.

ఏడు రోజుల్లోపు తనిఖీలు పూర్తి..

ప్రతి ఔషధ తనిఖీ అధికారి తన పరిధిలోని అన్ని క్యాన్సర్ ఆసుపత్రులు, చికిత్స కేంద్రాలను ఏడు రోజుల్లో తనిఖీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రుల్లో సాధారణంగా వినియోగించే క్యాన్సర్ మందులు తగ్గించిన ధరలకు అందుబాటులో ఉన్నాయా, ప్రతి ఔషధానికి కనీసం ఒక కంపెనీ మందు నిల్వ ఉందా, ధరల జాబితా ప్రదర్శిస్తున్నారా లేదా అనే అంశాలను పరిశీలించాలన్నారు. నవంబరు 9 నుంచి తగ్గించిన ధరలకు మందులు విక్రయిస్తున్నారా లేదా తెలుసుకునేందుకు ప్రతి ఔషధానికి సంబంధించి ఇటీవల జారీ చేసిన బిల్లులను పరిశీలించాలన్నారు. పాత ధరలతో ముద్రించిన ప్యాకెట్లలో ఉన్న మందులను సైతం తగ్గించిన ధరలకే విక్రయిస్తున్నారా అనేది నిర్ధారించుకోవాలని సూచించారు. అలాగే తయారీ కంపెనీల సరఫరా ఏజెంట్లు, సూపర్ స్టాకిస్టుల వద్ద ఔషధాల సవరించిన ధరల జాబితా అందిందా లేదా అన్నది ఔషధ తనిఖీ అధికారులు పరిశీలించాలన్నారు. నవంబరు 9 నుంచి జారీ చేసిన బిల్లుల్లో తగ్గించిన ధరలు నమోదు చేశారా, ఆ తేదీ నాటి నిల్వలు, ప్రస్తుత నిల్వలు ఎంత ఉన్నాయనే వివరాలను కూడా తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రస్తుత ధరల జాబితాలోని ధర లేదా ప్యాకెట్‌పై ముద్రించిన ధర.. ఈ రెండింటిలో ఏది తక్కువైతే దానికి అనుగుణంగా విక్రయాలు జరగాలని స్పష్టం చేశారు.

24 గంటల్లోనే పరిష్కారం..

ఆసుపత్రి, రోగి లేదా వారి సహాయకుల నుంచి మందులు అందుబాటులో లేవని ఫిర్యాదు వస్తే ఔషధ తనిఖీ అధికారి 24 గంటల్లో స్పందించాల్సి ఉంటుంది. జిల్లా సరఫరాదారుల జాబితా ద్వారా మందుల నిల్వ ఎక్కడ ఉందో గుర్తించి, ఆసుపత్రి లేదా రోగికి మందులు అందేలా వెంటనే చర్యలు తీసుకోవాలి. తగ్గించిన ధరల కంటే అధికంగా మందులు విక్రయిస్తే బిల్లులు, రికార్డులను అధికార యంత్రాంగం స్వాధీనం చేసుకోవాలి. మందుల ధరల జాబితాను ప్రదర్శించకపోతే 24 గంటల్లో నిబంధనలు పాటించాలని లిఖితపూర్వక ఆదేశాలు ఇవ్వాలి. మందుల విక్రయాన్ని నిలిపివేయడం లేదా నిరాకరించడం వంటి సందర్భాల్లో ఫిర్యాదుదారు, వ్యాపారి వాంగ్మూలాలను కచ్చితంగా నమోదు చేయాలి. అనుమతి లేని వ్యక్తులకు మందులు విక్రయించడం వంటి ఉల్లంఘనలపై నోటీసులు జారీ చేయాలి. జిల్లా సహాయ సంచాలకులు తమ పరిధిలో ఈ నియమాల అమలును వ్యక్తిగతంగా పర్యవేక్షించాలి. వివరాలతో ఎప్పటికప్పుడు నివేదిక రూపొందించాలి.



తండ్రి పేరు నిబంధన తొలగించాలి!

ప్రభుత్వ దరఖాస్తుల్లో ఆ నిబంధన సరికాదు
ప్రత్యామ్నాయంగా తల్లి పేరును అనుమతించాలి
తండ్రి పేరు లేనంత మాత్రాన సంక్షేమ పథకాలు ఆపొద్దు
ఏ చిన్నారికీ విద్య, అత్యవసర సేవలు దూరం కాకూడదు
స్పష్టం చేసిన బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్

విజయవాడ, నవంబర్ 10 (సమయం న్యూస్): ప్రభుత్వ శాఖల దరఖాస్తులు, అధికారిక రికార్డులు, ధ్రువీకరణ పత్రాల్లో చట్టపరంగా తప్పనిసరి కాని సందర్భాల్లో తండ్రి పేరు నమోదు చేయాలనే నిబంధనను తొలగించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎస్‌సీపీసీఆర్) స్పష్టం చేసింది. తండ్రి వివరాలు లేవనే కారణంతో ఏ చిన్నారికీ విద్య, గుర్తింపు పత్రాలు, ఉపకార వేతనాలు, సంక్షేమ పథకాలు, అత్యవసర సేవలు అందకుండా చేయకూడదని పిలుపునిచ్చింది. చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్, ఎస్‌సీపీసీఆర్ సంయుక్త ఆధ్వర్యంలో 'తండ్రి పేరు తప్పనిసరి నిబంధనను తొలగించడం' అనే అంశంపై మంగళవారం విజయవాడలో రాష్ట్రస్థాయి కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌సీపీసీఆర్ చైర్మన్ వెటుకూరి ఏవీఎస్ఎస్ఎన్ రాజు మాట్లాడుతూ.. ప్రతి చిన్నారికి స్వతంత్ర హక్కులు, గౌరవం, గుర్తింపు ఉంటాయన్నారు. తల్లిదండ్రుల వైవాహిక స్థితి, సామాజిక నేపథ్యం ఆధారంగా పిల్లల భవిష్యత్తును నిర్ణయించరాదన్నారు.

ఒంటరి తల్లులకు తప్పని ఇబ్బందులు..

ఐక్యరాజ్యసమితి బాలల హక్కుల కన్వెన్షన్ నిబంధనల ప్రకారం పిల్లల గుర్తింపు హక్కు, వ్యక్తిగత గోప్యత, విద్యా హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఒంటరి తల్లులు, అవివాహిత మహిళలు, విడాకులు పొందినవారు, మానవ అక్రమ రవాణా బాధితుల పిల్లలు ప్రభుత్వ దరఖాస్తుల్లో తండ్రి పేరు నిబంధనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చైర్మన్ ఆవేదన వ్యక్తం చేశారు. జనన ధ్రువీకరణ పత్రాలు, పాఠశాల ప్రవేశాలు, ఉపకార వేతనాల సాధనలో ఇది అనవసర అడ్డంకిగా మారిందన్నారు. తండ్రి పేరుకు బదులుగా తల్లి పేరు లేదా చట్టబద్ధంగా గుర్తింపు పొందిన సంరక్షకుల వివరాలను ప్రత్యామ్నాయంగా అనుమతించాలని సూచించారు. దీనికి అనుగుణంగా ఆన్‌లైన్ పోర్టళ్లలో అవసరమైన మార్పులు చేపట్టాలని, క్షేత్రస్థాయి అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోరారు. తండ్రి పేరు తప్పనిసరి నిబంధనను తొలగించడం అంటే తండ్రులను మినహాయించడం లేదా చట్టబద్ధమైన హక్కులను నిరాకరించడం కాదని కమిషన్ ఈ సందర్భంగా స్పష్టం చేసింది.

సమన్వయంతోనే సమగ్ర ఉత్తర్వులు..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఏ చిన్నారికీ విద్య, అవకాశాలు దూరం కాకుండా సమగ్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. కుటుంబ పరిస్థితులతో సంబంధం లేకుండా మహిళలు, పిల్లలందరికీ సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని ఆమె నొక్కిచెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖల్లో ఒకే విధమైన బాలల హిత పరిపాలనా విధానాన్ని అమలు చేయాలని ఆమె సూచించారు. ఈ వర్క్‌షాప్‌లో కృష్ణా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి ఎం.కె.విజయలక్ష్మి, విద్యాశాఖ అసిస్టెంట్ కమిషనర్ రామారావు, జువైనల్ వెల్ఫేర్ శాఖకు చెందిన పి.రమణారెడ్డి, డైరెక్టర్ వసంతబాల, ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ శిరీష, పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ వి.ఎస్.సుబ్బారావు, ఏలూరు సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ పి.వి.రావు, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హేమంత్ కుమార్, హెల్ప్ డైరెక్టర్ రామ్మోహన్, ఎస్‌సీపీసీఆర్ సభ్యులు గాంధీబాబు, చల్లా మధుసూదనరావు, వివిధ జిల్లాల సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణంలో.. వేగం పెంచాలి!

పీపీపీ రోడ్ల అభివృద్ధి ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి ఆరా
సీఎం చంద్రబాబు ఆలోచనల మేరకు మెరుగైన సౌకర్యాలు
ప్రాజెక్టులు వేగవంతంగా పట్టాలెక్కేలా చర్యలు చేపట్టాలి
క్షేత్రస్థాయిలో సమస్యలుంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలి

అమరావతి, నవంబర్ 10 (సమయం న్యూస్): రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో చేపడుతున్న రహదారుల అభివృద్ధి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని ఆర్ అండ్ బీ, ఐ అండ్ ఐ శాఖ కార్యాలయంలో పీపీపీ రోడ్ల అభివృద్ధి పురోగతిపై ఆయన ప్రత్యేకంగా సమీక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా పది ప్రాజెక్టులను పీపీపీ విధానంలో, ఒక ప్రాజెక్టును హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) విధానంలో చేపడుతున్నట్లు అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. ఈ పది ప్రాజెక్టుల్లో ఇప్పటికే ఆరు ప్రాజెక్టులకు డీపీఆర్ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. వీటిని కేంద్ర ప్రభుత్వానికి పంపేందుకు వీజీఎఫ్ (వయబిలిటీ గ్యాప్ ఫండ్) నిధుల ప్రతిపాదనలను సిద్ధం చేశామని వెల్లడించారు.

వెంటనే పట్టాలెక్కేలా చర్యలు..

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనల మేరకు ప్రజలకు మెరుగైన రహదారుల సదుపాయం కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని మంత్రి జనార్ధన్ రెడ్డి సూచించారు. ఇందుకోసం చేపట్టిన పీపీపీ ప్రాజెక్టులను వేగవంతంగా పట్టాలెక్కించేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా ఈ ప్రాజెక్టుల భూసేకరణకు అవసరమైన నిధులపై చర్చించి, వాటిని వెంటనే సమకూర్చుకోవాలని స్పష్టం చేశారు. పీపీపీ ప్రాజెక్టుల బిడ్డింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆర్ అండ్ బీ శాఖ ఉన్నతాధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ రహదారుల నిర్మాణానికి సంబంధించి క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని మంత్రి సూచించారు.



నాలో నేనే.. యుద్ధం చేశా!

ఆ నిర్ణయానికి ముందే మనసులో తీవ్ర ఊగిసలాట

పిల్లల భయంతోనే నాడు ప్రధాని పదవికి దూరం

కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ ఆత్మకథ విడుదల

ఆ పుస్తకంలో రాజీవ్, మన్మోహన్‌ల గురించి కీలక ప్రస్తావనలు

న్యూఢిల్లీ, నవంబర్ 10 (సమయం న్యూస్) : అది 2004 సార్వత్రిక ఎన్నికల సమయం. అప్పుడే కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ కూటమి అనూహ్య విజయం సాధించింది. అందరూ సోనియా గాంధీ ప్రధాని అవుతారని భావించారు. కానీ ఆమె సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఆ పదవి వద్దంటూ తప్పుకున్నారు. రెండు దశాబ్దాల క్రితం జరిగిన ఈ చారిత్రక పరిణామం వెనుక ఉన్న అసలు కారణాలను కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ స్వయంగా వెల్లడించారు. తన జీవితంలో జరిగిన అనేక ఘట్టాలను వివరిస్తూ ఆమె రాసిన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' మంగళవారం విడుదలైంది. అందులో రాజీవ్ గాంధీ మరణం, కాంగ్రెస్‌లో తన ప్రవేశం, మన్మోహన్ సింగ్ ఎంపిక తదితర కీలక విషయాలను సోనియా పంచుకున్నారు.

పిల్లల భయమే కారణం..

సార్వత్రిక ఎన్నికలకు చాలా నెలల ముందే తాను ప్రధాని పదవిని చేపట్టకూడదని నిర్ణయించుకున్నట్లు సోనియా గాంధీ తన పుస్తకంలో రాసుకొచ్చారు. తన అత్త, భర్త అత్యంత దారుణంగా హత్యకు గురైన దృశ్యాలను కళ్లారా చూసిన రాహుల్, ప్రియాంకలు సైతం తాను ఆ పదవిని చేపట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారని ఆమె గుర్తుచేసుకున్నారు. ఆ హోదా తమ కుటుంబానికి మరింత ప్రమాదకరమని పిల్లలు భావించారన్నారు. అయితే పార్టీలో అనైక్యత రాకూడదనే ఉద్దేశంతో ఎన్నికల సమయంలో తన నిర్ణయాన్ని బహిర్గతం చేయలేదని తెలిపారు. ఫలితాలు వెలువడి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే సమయానికి తన ముందు సముద్రమంత సమస్య వచ్చి పడిందని, ఆ సమయంలో తనలో భావోద్వేగాలు క్షణక్షణానికీ ఎలా మారాయో సోనియా కళ్లకు కట్టారు.

మరుసటి రోజే యూపీఏ భేటీ..

ఫలితాల మరుసటి రోజు తమ ఇంట్లో జరిగిన యూపీఏ కూటమి నేతల సమావేశంలో తనకు పదవి వద్దని చెప్పినట్లు సోనియా తెలిపారు. అయితే నేతలంతా తన చుట్టూ చేరి బలవంతం చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆ క్షణానికి సరేనన్నట్లు వెల్లడించారు. ఈ మాట విన్న వెంటనే ప్రియాంక కళ్లు ఎర్రబడ్డాయని, పరుగున వెళ్లి రాహుల్‌కు చెప్పిందని సోనియా గుర్తుచేసుకున్నారు. ఆ రోజు రాత్రి తన మనసులో పెద్ద యుద్ధమే జరిగిందని, ఆ క్షణం తన భర్త రాజీవ్ పక్కనుంటే ఎంత బాగుండు అనిపించిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన విదేశీ మూలాలను ఎత్తిచూపుతూ ప్రత్యర్థులు ఎంతటి వివాదం సృష్టిస్తారో తెలుసునని, అలాంటప్పుడు ఈ దేశానికి ఎలా మేలు చేయగలనని ఆమె ప్రశ్నించుకున్నారు. చివరికి అనేక గంటల మల్లగుల్లాల తర్వాత మనసు చెప్పిందే వినాలని ఒక దృఢ నిశ్చయానికి వచ్చినట్లు వివరించారు.

అందుకే మన్మోహన్ ఎంపిక..

తన నిర్ణయం తర్వాత ప్రధాని అభ్యర్థిగా మన్మోహన్ సింగ్ పేరును తానే ప్రతిపాదించినట్లు సోనియా గాంధీ ఆ పుస్తకంలో పేర్కొన్నారు. మరుసటి రోజు జరిగిన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో తాను తీసుకున్న నిర్ణయాన్ని తొలుత ఎంపీలంతా తీవ్రంగా వ్యతిరేకించినా, ఆ తర్వాత వారికి పరిస్థితిని వివరించినట్లు తెలిపారు. సుదీర్ఘకాలం పాటు ప్రభుత్వ పదవుల్లో పనిచేసిన అనుభవం ఉన్న వ్యక్తి అయితేనే కూటమికి నేతృత్వం వహించగలరని తాను భావించినట్లు చెప్పారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో ఏ వర్గానికి కొమ్ముకాయకుండా ఆయన అత్యంత తటస్థంగా ఉంటారన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సోనియా వెల్లడించారు. అప్పట్లో బయట నుంచి మద్దతు ఇస్తున్న కమ్యూనిస్టులు సైతం తన నిర్ణయాన్ని స్వాగతిస్తారని నమ్మానని, మన్మోహన్ చేతుల్లో దేశం సురక్షితంగా ఉంటుందన్న పూర్తి విశ్వాసంతోనే ఆ ఎంపిక జరిగినట్లు సోనియా గాంధీ తన ఆత్మకథలో స్పష్టం చేశారు.

కళ్లలోకి చూసి.. మాట్లాడరు!

ప్రధాని మోదీతో తనకు వ్యక్తిగత సంభాషణలు ఏమీ లేవు

న్యూఢిల్లీ, నవంబర్ 10 (సమయం న్యూస్) : ప్రధాని నరేంద్ర మోదీతో తనకు ఇప్పటివరకు పెద్దగా వ్యక్తిగత సంభాషణలు ఏమీ జరగలేదని కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ వెల్లడించారు. అధికారిక కార్యక్రమాల్లో ఎదురుపడినప్పుడు కేవలం పరస్పరం నమస్కారం మాత్రమే చేసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. అయితే ఆ సమయంలో మోదీ తనతో మాట్లాడేటప్పుడు కళ్లలోకి కాకుండా పక్కకు చూస్తారని ఆమె పేర్కొన్నారు. తన జీవిత ప్రయాణంపై రాసిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' ఆత్మకథలో మోదీతో తనకున్న పరిచయం, సైద్ధాంతిక విభేదాలపై ఆమె పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. పార్లమెంట్ సమావేశాల ముగింపు వేళ స్పీకర్ ఛాంబర్‌లో జరిగే భేటీల్లో నేతలంతా కలుస్తుంటారని, అక్కడ మోదీ ఎదురైతే కేవలం ఓ నమస్కారంతోనే సరిపెడతారని ఆమె వివరించారు. గతంలో భిన్న రాజకీయ పార్టీల నేతల మధ్య పరస్పర గౌరవం, స్నేహపూర్వక వాతావరణం ఉండేదని ఆమె గుర్తుచేశారు. మోదీతో తనకు పెద్దగా మాటలు లేకపోయినప్పటికీ పుట్టినరోజు, నూతన సంవత్సర వేడుకల సమయంలో ఒకరికొకరు శుభాకాంక్షలు మాత్రం చెప్పుకుంటామని సోనియా తెలిపారు. తాను అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరి ఇంటికి తిరిగొచ్చిన సందర్భాల్లో మోదీ ఫోన్ చేసి తన ఆరోగ్యం గురించి ఆరా తీశారని, అందుకు తాను కృతజ్ఞతలు సైతం తెలిపానని ఆమె వెల్లడించారు. అయితే దేశం పట్ల మోదీకి, తనకు పూర్తిగా భిన్నమైన ఆలోచనలు ఉన్నాయని స్పష్టం చేశారు. తన దృష్టిలో భారత్ అంటే భిన్న జాతులు, సంస్కృతులు, భాషలు, మతాలు కలిసిమెలిసి జీవించే లౌకిక, సమానత్వ దేశమని ఆమె వివరించారు. స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం, సమ్మిళితత్వం తన భారతీయ భావనకు పునాదులని ఆమె కుండబద్దలు కొట్టారు. కానీ మోదీ దృక్పథం ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్తల ఆలోచనలు, ఆయన వ్యక్తిగత అనుభవాల ద్వారా రూపుదిద్దుకుందని ఆమె విమర్శించారు. ఆర్ఎస్ఎస్ దృక్పథంలో ఒక మతం, సంస్కృతికి ఇతరులకంటే ప్రాధాన్యం ఉంటుందని సోనియా అభిప్రాయపడ్డారు. అయితే ఇది తమ ఇద్దరి మధ్య ఉన్న వ్యక్తిగత విభేదం కాదని, దేశ భవిష్యత్తుపై ఉన్న భిన్నమైన ఆలోచనల మధ్య జరుగుతున్న పోరాటమని ఆమె స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో మోదీ ప్రతిపక్షాలను ఉద్దేశించి తరచూ కఠిన పదజాలం ఉపయోగిస్తుంటారని ఆమె ఆరోపించారు. ముఖ్యంగా దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపై బీజేపీ అవలంబిస్తున్న వైఖరిని ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. నెహ్రూ దేశాన్ని ప్రజాస్వామ్య, లౌకిక మార్గంలో నడిపించారని గుర్తుచేశారు. 'కాంగ్రెస్ దాని విధానాలు, సిద్ధాంతాలను కూడా అంతం చేయాలనే కుట్ర దాగి ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

తాత ఆస్తిపై.. మనవళ్లకు హక్కుల్లేవు!

- పుట్టుకతోనే వాటా వస్తుందనుకోవడం పొరపాటు
- తండ్రికి వారసత్వంగా వచ్చిన ఆస్తి ఆయన వ్యక్తిగతమే
- ఆ ఆస్తి విక్రయాన్ని అడ్డుకునే హక్కు ఎవరికీ లేదు
- హిందూ వారసత్వ చట్టం సెక్షన్ 8 ప్రకారం పంపకాలు
- కీలక తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు ధర్మాసనం



న్యూఢిల్లీ, నవంబర్ 10 (సమయం న్యూస్): తాతల నుంచి వారసత్వంగా వచ్చిన ఆస్తిలో మనవళ్లకు పుట్టుకతోనే వాటా లభిస్తుందనే అభిప్రాయం అన్ని సందర్భాల్లో సరైనది కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తాత మరణానంతరం హిందూ వారసత్వ చట్టం ప్రకారం ఆయన ఆస్తి కుమారులు, కుమార్తెలకు పంపిణీ అయినప్పుడు తండ్రికి వచ్చిన వాటాపై ఆయనకే పూర్తి హక్కులు ఉంటాయని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఆ ఆస్తిని తన ఇష్టానుసారం విక్రయించుకునే అధికారం తండ్రికి పూర్తిగా ఉంటుందని, కుమారులు లేదా మనవళ్లు ఆ లావాదేవీని ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకోలేరని పేర్కొంది.

కొట్టివేసిన సుప్రీంకోర్టు..

చెన్నైకి చెందిన ఓ వ్యక్తి 1997లో తన తాత ఆస్తిలో సగం వాటా కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. తాత ఆస్తి పంపకం ద్వారా తన తండ్రికి సంక్రమించిన భూమిని ఆయన ఇతరులకు విక్రయించడాన్ని ఆ పిటిషన్‌లో సవాలు చేశాడు. సుదీర్ఘకాలం నడిచిన ఈ వివాదంపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం సదరు వ్యక్తి దాఖలు చేసిన అప్పీల్‌ను తాజాగా కొట్టివేసింది. తండ్రికి వారసత్వంగా వచ్చిన ఆస్తిపై కుమారుడికి పుట్టుకతోనే హక్కు ఏర్పడదని స్పష్టం చేసింది.

ఆస్తిపై తండ్రికే పూర్తి అధికారం..

1956 నాటి హిందూ వారసత్వ చట్టంలోని సెక్షన్ 8 ప్రకారం తాత మరణించిన తర్వాత ఆయన ఆస్తి ప్రాథమిక వారసులైన క్లాస్-1 వారసులు అనగా కుమారులు, కుమార్తెలకు చెందుతుంది. ఈ నిబంధన ప్రకారం ఆస్తి పంపిణీ జరిగినప్పుడు తండ్రికి దక్కిన వాటా ఆయన వ్యక్తిగత ఆస్తిగా మారుతుందని న్యాయస్థానం స్పష్టంగా వివరించింది. అలాంటి ఆస్తిపై కుమారులు, మనవళ్లకు పుట్టుకతోనే హక్కులు ఉండవని తేల్చిచెప్పింది. తండ్రి జీవించి ఉన్నంతకాలం తన వాటా ఆస్తిని విక్రయించడం, ఇతరులకు బదలాయించడం సహా దానిపై సొంతంగా నిర్ణయాలు తీసుకునే అధికారం ఆయనకే ఉంటుందని స్పష్టం చేసింది. చట్ట ప్రకారం ఆస్తి పంపకాలు పూర్తయిన తర్వాత దానిని ఉమ్మడి కుటుంబ ఆస్తిగా కాకుండా సంబంధిత వారసుడి వ్యక్తిగత ఆస్తిగానే పరిగణించాల్సి ఉంటుందని సర్వోన్నత న్యాయస్థానం తన తీర్పులో పేర్కొంది.

డిజిటల్ అరెస్ట్‌లపై.. సుప్రీం సీరియస్!

- సైబర్ మోసాల నివారణకు పక్కా చర్యలు
- వాట్సాప్‌కు సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక ఆదేశాలు
- రక్షణ ప్రణాళికను వెంటనే సమర్పించాలని సూచన
- తొమ్మిది వేల ఖాతాలపై చర్యలు తీసుకున్న వాట్సాప్
- తదుపరి విచారణ ఈ నెల 23కు వాయిదా

న్యూఢిల్లీ, నవంబర్ 10 (సమయం న్యూస్): దేశవ్యాప్తంగా ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్న డిజిటల్ అరెస్ట్ మోసాలు, సైబర్ నేరాల నియంత్రణపై సుప్రీంకోర్టు సీరియస్ అయింది. ఇలాంటి మోసాలను అడ్డుకునేందుకు తీసుకోబోయే చర్యలపై సమగ్ర నివేదిక సమర్పించాలని వాట్సాప్‌తో పాటు ఇతర మధ్యవర్తిత్వ సంస్థలను ఆదేశించింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జైమాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు కీలక సూచనలు చేసింది. డిజిటల్ అరెస్ట్ పేరుతో నకిలీ పత్రాలను చూపిస్తూ ప్రజలను భయపెట్టి మోసాలకు పాల్పడుతున్న ఘటనలను అరికట్టేందుకు సంస్థలు అనుసరించనున్న రక్షణ విధానాలను వివరించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది.

ఐఫోర్సీకి కార్యాచరణ ప్రణాళికలు..

'ఇన్ రీ: విక్టిమ్స్ ఆఫ్ డిజిటల్ అరెస్ట్ రిలేటెడ్ టు ఫోర్జ్డ్ డాక్యుమెంట్స్' పేరుతో సుమోటోగా స్వీకరించిన కేసును ధర్మాసనం తాజాగా విచారించింది. సంస్థలు తమ కార్యాచరణ ప్రణాళికలను ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐఫోర్సీ)కు కూడా ఒకేసారి అందజేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను నవంబర్ 23కి వాయిదా వేసింది. వాట్సాప్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ సైబర్ నేరాల నియంత్రణలో భాగంగా ఇప్పటికే 9,400 అనుమానాస్పద ఖాతాలపై చర్యలు తీసుకున్నట్లు కోర్టుకు తెలిపారు. ఈ వివరాలను పొందుపరుస్తూ పూర్తి స్థాయి అఫిడవిట్ దాఖలు చేస్తామని ఆయన వెల్లడించారు.

కొత్త సాఫ్ట్‌వేర్ రూపకల్పన..

అనుమానాస్పద ఖాతాలను ఆటోమెటిక్‌గా గుర్తించి, వాటి ద్వారా ఎదురయ్యే ముప్పుపై వినియోగదారులను ముందుగానే అప్రమత్తం చేసే అధునాతన సాఫ్ట్‌వేర్ రూపకల్పనకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వాట్సాప్ తరఫు న్యాయవాది వివరించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం డిజిటల్ అరెస్ట్ మోసాల ద్వారా నకిలీ పత్రాలను ఉపయోగించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న నేరగాళ్లను అడ్డుకునేందుకు మరింత సమర్థవంతమైన చర్యలు అవసరమని స్పష్టం చేసింది. ఈ తరహా మోసాల నివారణకు చేపట్టనున్న నిర్దిష్ట చర్యలు, వాటి అమలు విధానాన్ని తదుపరి విచారణలో తమ ముందుంచాలని వాట్సాప్, ఇతర సంస్థలను సుప్రీంకోర్టు ఆదేశించింది.

కాలుష్యంలో.. విశ్వగురువుగా మారుతారా?

కేంద్రం తీరుపై మండిపడ్డ ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే

ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్

దేశ రాజధానిలో కాలుష్యానికి వేలాది మంది బలి

36 కేంద్రాల్లో కనిపించకుండా పోయిన పీఎం 2.5 రీడింగ్స్

న్యూఢిల్లీ, నవంబర్ 10 (సమయం న్యూస్): దేశంలో వాయు కాలుష్యం తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంలో ఘోరంగా విఫలమైందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీజేపీ పాలనలో కాలుష్య నియంత్రణ కంటే ప్రచార ఆర్భాటాలు, రాజకీయ నిందారోపణలకే అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. గతేడాది వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) కేంద్రాల చుట్టూ కేవలం నీటిని స్ప్రే చేసి చేతులు దులుపుకోగా.. ఈసారి ఏకంగా 36 కేంద్రాల్లో పీఎం 2.5 రీడింగ్స్ కనిపించకుండా పోయాయని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వాయు కాలుష్యంలోనూ భారత్ విశ్వగురువుగా మారుతుందా అంటూ ఆయన కేంద్రాన్ని సూటిగా ప్రశ్నించారు. 2019లోనే వాయు కాలుష్యాన్ని ప్రధాన సవాలుగా ప్రధాని నరేంద్ర మోదీ గుర్తించినప్పటికీ.. దాన్ని పరిష్కరించే దిశగా ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోలేదని ఖర్గే విమర్శించారు.



నిధులు ఖర్చు చేయకుండా..

రాజధాని ఢిల్లీలో 2023 సంవత్సరంలో కేవలం వాయు కాలుష్యం కారణంగానే 17,188 మంది ప్రాణాలు కోల్పోయారని ఖర్గే ఆవేదన వ్యక్తం చేశారు. అంతకుముందు 2021లో ఐదేళ్లలోపు పిల్లల్లో ఏకంగా లక్షా 69 వేల మరణాలు నమోదయ్యాయని ఆయన గుర్తుచేశారు. కాలుష్య నివారణ కోసం ఉద్దేశించిన ఢిల్లీ క్లీన్ ఎయిర్ నిధుల్లో రూ.1,154 కోట్లు ఖర్చు చేయకుండానే మిగిలిపోయాయని ఆరోపించారు. అందుబాటులో ఉన్న నిధుల్లో కేవలం 17 శాతం మాత్రమే వినియోగించారని మండిపడ్డారు. కాలుష్య నియంత్రణకు కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

ప్రజల ప్రాథమిక హక్కు..

దేశవ్యాప్తంగా కాలుష్య ఉద్గారాలను తగ్గించేందుకు తక్షణమే పకడ్బందీ చర్యలు చేపట్టాలని మల్లికార్జున ఖర్గే సూచించారు. పర్యావరణ నిబంధనలను అత్యంత కఠినంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. పీల్చుకునేందుకు స్వచ్ఛమైన గాలి దొరకడం ప్రజల ప్రాథమిక హక్కు అని, అది ప్రభుత్వం ప్రజలకు ఇచ్చే వరం ఏమాత్రం కాదని ఆయన కుండబద్దలు కొట్టారు. నిత్యం ప్రాణాలు బలిగొంటున్న వాయు కాలుష్యంపై ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు తక్షణమే సమాధానం చెప్పాలని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే డిమాండ్ చేశారు.

వాళ్ల విశ్వసనీయతే.. ప్రశ్నార్థకం!

బంగ్లాదేశ్ మురికివాడలను ఢిల్లీగా చూపిస్తున్న చైనా వ్లాగర్లు

ఈ తరహా వక్రీకరణలు అత్యంత విచారకరమని భారత్ ఫైర్

న్యూఢిల్లీ, నవంబర్ 10 (సమయం న్యూస్) : బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలోని మురికివాడలు, పేదలు నివసించే ప్రాంతాలను చిత్రీకరించి.. వాటిని భారత రాజధాని ఢిల్లీ దృశ్యాలుగా ప్రచారం చేస్తున్న చైనా వ్లాగర్ల వ్యవహారంపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఒక దేశానికి సంబంధించిన వాస్తవ పరిస్థితులను వక్రీకరించి మరో దేశానికి ఆపాదించడం అత్యంత విచారకరమని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. డబ్బులు తీసుకుని లేదా విదేశీ శక్తుల ప్రోద్బలంతో ఇలాంటి దుష్ప్రచారానికి పాల్పడితే.. అటువంటి వ్యక్తుల విశ్వసనీయతే ప్రశ్నార్థకమవుతుందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వ్యాఖ్యానించారు. ఈ తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్న వ్లాగర్లపై బంగ్లాదేశ్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దాదాపు 150 మంది చైనా పౌరులు ఢాకాలోని టెక్‌పారా, ఉత్తర తదితర ప్రాంతాల్లో వీడియోలు తీసి.. వాటిని ఢిల్లీగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తూ భారత్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని 'ప్రోథోమ్ ఆలో' పత్రిక సంచలన కథనం ప్రచురించింది. మరోవైపు బ్రిటన్‌లో భారత మర్చంట్ నేవీ మాస్టర్ కెప్టెన్ అజయ్ పంత్ అరెస్టు వ్యవహారంపైనా జైస్వాల్ స్పందించారు. ఆయన న్యాయవాదులు, కుటుంబ సభ్యులతో భారత ప్రభుత్వం నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని తెలిపారు. లండన్‌లోని భారత హైకమిషన్ అధికారులు పలుమార్లు కెప్టెన్ పంత్‌ను కలిసి యోగక్షేమాలు తెలుసుకున్నారని చెప్పారు. ఈ వ్యవహారంపై బ్రిటన్ హైకమిషన్, ఆ దేశ విదేశాంగ కార్యాలయంతోనూ చర్చలు కొనసాగుతున్నాయన్నారు. కెప్టెన్ భద్రత, సంక్షేమానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నామని ఆయన వివరించారు. అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలపై సైతం భారత విదేశాంగ శాఖ తొలిసారిగా స్పందించింది. అక్కడి ఎన్నికల పరిణామాలు భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపబోవని స్పష్టం చేసింది. రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నామని జైస్వాల్ పేర్కొన్నారు. భారత్‌లో మతపరమైన ప్రార్థనా స్థలాలపై దాడులు పెరుగుతున్నాయంటూ అమెరికాకు చెందిన యూఎస్‌సీఐఆర్ఎఫ్ (యునైటెడ్ స్టేట్స్ కమిషన్ ఆన్ ఇంటర్నేషనల్ రిలీజియస్ ఫ్రీడమ్) కమిషనర్ చేసిన వ్యాఖ్యలను జైస్వాల్ తీవ్రంగా ఖండించారు. ఆ సంస్థ పక్షపాతంతో వ్యవహరిస్తోందని, సరైన అవగాహన లేకుండా రాజకీయ ప్రయోజనాలతో వ్యాఖ్యలు చేస్తోందని ఆయన విమర్శించారు. అమెరికాలో మతపరమైన ప్రార్థనా స్థలాలపై జరుగుతున్న దాడులు, అక్కడి భారతీయులపై చోటుచేసుకుంటున్న ద్వేషపూరిత నేరాలు, జాతి వివక్ష ఘటనలపై మాత్రం ఆ సంస్థ ఎందుకు స్పందించడం లేదని సూటిగా ఆరోపించారు.



తెలుగుకు.. బ్రౌన్ వెలుగుబాట!

జయంతి సందర్భంగా మంత్రి దుర్గేష్ ఘన నివాళి

విదేశీయుడైనా తెలుగు భాషపై అపారమైన ప్రేమ

తొలి ప్రామాణిక నిఘంటువును అందించిన మహనీయుడు

ప్రాచీన కావ్యాలను బతికించిన గొప్ప సాహితీ కర్ణుడు

మాతృభాషను కాపాడుకోవడమే ఆయనకు అసలైన నివాళి

అమరావతి, నవంబర్ 10 (సమయం న్యూస్) : తెలుగు సాహిత్య వికాసానికి విశేష సేవలు అందించిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (సి.పి. బ్రౌన్) జయంతి సందర్భంగా రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ఆయనకు ఘన నివాళులు అర్పించారు. తెలుగు సాహిత్యానికి బ్రౌన్ చూపిన వెలుగుబాట ఎప్పటికీ చిరస్మరణీయమని ఆయన కీర్తించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటన విడుదల చేస్తూ సి.పి.బ్రౌన్ సేవలను కొనియాడారు. ఆయన విదేశీయుడైనప్పటికీ తెలుగును తన మాతృభాషగా ప్రేమించి, దాని వ్యాప్తికి జీవితాన్ని అంకితం చేశారని ప్రశంసించారు. తెలుగులో తొలి ప్రామాణిక నిఘంటువును రూపొందించి, నేటికీ అది ప్రామాణికంగా నిలిచేలా చేసిన మహనీయుడు సి.పి.బ్రౌన్ అని మంత్రి దుర్గేష్ కొనియాడారు. మరుగున పడిపోతున్న ఎన్నో ప్రాచీన తెలుగు కావ్యాలను వ్యయప్రయాసలకోర్చి సేకరించి, వాటికి ప్రాణం పోసి భావితరాలకు దానం చేసిన గొప్ప 'సాహితీ కర్ణుడు' ఆయన అని కీర్తించారు. సి.పి. బ్రౌన్ చూపిన బాటలో మన మాతృభాష తెలుగు గొప్పదనాన్ని, అపారమైన మన సాహితీ సంపదను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. మన భాషను కాపాడుకోవడమే ఆ మహనీయుడికి మనం ఇచ్చే నిజమైన నివాళి అని మంత్రి దుర్గేష్ తన ప్రకటనలో పిలుపునిచ్చారు.

సింధుకు గౌరవం.. మంత్రి హర్షం!

ఐఓఏ అథ్లెట్స్ కమిషన్ చైర్‌పర్సన్‌గా బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు

వైస్ చైర్‌పర్సన్‌గా హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ ఎన్నిక

క్రీడాకారులకు కీలక బాధ్యతలు దక్కడం దేశానికే గర్వకారణం

ప్రత్యేక అభినందనలు తెలిపిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

రాష్ట్రంలో క్రీడారంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం

అమరావతి, నవంబర్ 10 (సమయం న్యూస్) : భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అథ్లెట్స్ కమిషన్ చైర్‌పర్సన్‌గా బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధుకు అరుదైన గౌరవం దక్కడం పట్ల రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సింధుకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అలాగే అథ్లెట్స్ కమిషన్ వైస్ చైర్‌పర్సన్‌గా భారత హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ ఎన్నిక కావడం కూడా ఎంతో అభినందనీయమని మంత్రి కొనియాడారు. ఐఓఏ జనరల్ బాడీలో అథ్లెట్ ప్రతినిధులుగా మీరాబాయి చాను, సాజన్ ప్రకాశ్ ఎంపిక కావడం భారత క్రీడారంగానికే గర్వకారణమని ఆయన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో దేశానికి విశేష కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిన క్రీడాకారులకు ఇలాంటి కీలక బాధ్యతలు దక్కడం ఎంతో సంతోషంగా ఉందని రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. క్రీడాకారుల నాయకత్వంలో భారత క్రీడారంగం మరింత బలోపేతం అవుతుందన్న ఆశాభావం ఆయన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, మంత్రి నారా లోకేశ్ మార్గదర్శకత్వంలో రాష్ట్రంలో క్రీడారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని వివరించారు. గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, వారిని అన్ని విధాలుగా ప్రోత్సహించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఉద్ఘాటించారు.



అమెరికా సమన్లపై.. భారత్ ఫైర్!

ఉగ్రవాది పన్నూ కేసులో విదేశాంగ శాఖకు నోటీసులు

దోవల్, గోయల్ పేర్లతో పాటు అధికారుల ప్రస్తావన

హత్యకు కుట్ర పన్నారని గతంలో పన్నూ ఫిర్యాదు

అమెరికా చర్యలను తీవ్రంగా ఖండించిన భారత్

న్యూఢిల్లీ, నవంబర్ 10 (సమయం న్యూస్) : ఉగ్రవాది గుర్పత్‌వంత్ సింగ్ పన్నూ ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో భారత ప్రభుత్వానికి అమెరికా విదేశాంగశాఖ సమన్లు జారీ చేసింది. పన్నూ ఈ కేసులో ప్రతివాదులుగా జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, రీసెర్చ్ అండ్ ఎనాలిసిస్ వింగ్ (రా) మాజీ అధిపతి సమంత్ గోయల్‌తో పాటు పలువురు భారతీయ అధికారుల పేర్లను స్పష్టంగా పేర్కొన్నాడు. తద్వారా వీరందరికీ అమెరికా సమన్లు జారీ చేసినట్లయ్యింది. గత నెల తొమ్మిదో తేదీన సదరు సమన్లను అమెరికా విదేశాంగశాఖ.. వాషింగ్టన్‌లోని భారతీయ రాయబార కార్యాలయానికి అధికారికంగా పంపించింది. కాగా భారతీయ అధికారులకు అమెరికా సమన్లు జారీ చేయటాన్ని భారత విదేశాంగశాఖ తీవ్రంగా ఖండించింది. గుర్పత్‌వంత్ సింగ్‌కు అమెరికా పౌరసత్వం ఉందన్న విషయం తెలిసిందే. తనను హత్య చేయించటానికి భారత ప్రభుత్వం కుట్ర పన్నిందని ఆరోపిస్తూ ఆయన గతంలో అమెరికాలో కేసు దాఖలు చేశాడు. ఇందుకోసం నిఖిల్‌గుప్తా అనే భారతీయుడిని ప్రత్యేకంగా నియమించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ కేసులో అమెరికా పోలీసులు విస్తృతంగా దర్యాప్తు జరిపారు. ఈ క్రమంలో నిఖిల్‌గుప్తా 2023 జూన్‌లో చెక్ రిపబ్లిక్‌లోని ప్రేగ్‌లో అరెస్టయ్యాడు. అతడిని ఆ దేశం అమెరికాకు అప్పగించింది.



ఒక్కరైతూ.. నష్టపోవద్దు!

- **పంట నష్టాల నమోదును వేగవంతం చేయాలి**
- **అధికారులకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశం**
- **వ్యవసాయ, ఉద్యాన శాఖ ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్**
- **ఆర్నాబ్, మురసు తుఫానులతో భారీగా దెబ్బతిన్న పంటలు**
- **కోనసీమ జిల్లాలో అత్యధికంగా వ్యవసాయ సాగుకు నష్టం**

అమరావతి, నవంబర్ 10 (సమయం న్యూస్) : రాష్ట్రంలో ఇటీవల సంభవించిన ఆర్నాబ్, మురసు తుఫానుల కారణంగా వ్యవసాయ, ఉద్యాన పంటలకు జరిగిన నష్టాల నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం ఆయన ఆయా శాఖల ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రెండు తుఫానుల వల్ల జరిగిన నష్టాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, ఇంకా నమోదు చేయాల్సిన పంటల విస్తీర్ణం, రైతుల సంఖ్యను జిల్లాలవారీగా పక్కాగా గుర్తించాలన్నారు. ఎన్యూమరేషన్‌ను త్వరితగతిన పూర్తిచేసి, అర్హులైన ఒక్క రైతు కూడా మిగిలిపోకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ రెండు తుఫానుల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా 4,61,194 హెక్టార్లలో వ్యవసాయ పంటలు, 29,960 హెక్టార్లలో ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు ఈ సమీక్షలో అధికారులు మంత్రికి వివరించారు.



రూ.2,392 కోట్ల ఆర్థిక నష్టం..

ఆర్నాబ్ తుఫాను ప్రభావంతో పదిహేను జిల్లాల్లో 3,27,843 హెక్టార్లలో పంటనష్టం జరగ్గా.. ఐదు లక్షల ఇరవై మూడు వేల మందికి పైగా రైతులు నష్టపోయారు. దాదాపు తొమ్మిది లక్షల డెబ్భై ఎనిమిది వేల టన్నుల ఉత్పత్తి నష్టంతో రూ.2,392 కోట్ల మేర ఆర్థిక నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేశారు. ముఖ్యంగా కోనసీమ జిల్లాలో అత్యధికంగా 99.19 శాతం సాగు విస్తీర్ణం దెబ్బతిన్నట్లు వెల్లడించారు. ఈ తుఫాను నష్టాలకు సంబంధించి ఎస్‌డీఆర్ఎఫ్ కింద రూ.815 కోట్లు, ఎన్‌డీఆర్ఎఫ్ కింద రూ.714 కోట్లు అంచనా వేసినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు ఇదే ఆర్నాబ్ తుఫాను కారణంగా 23,211 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతినగా.. ఇప్పటికే 99.24 శాతం ఎన్యూమరేషన్ పూర్తయిందని, కృష్ణా జిల్లా మినహా మిగిలిన పద్నాలుగు జిల్లాల్లో నూరు శాతం నమోదు ప్రక్రియ ముగిసిందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.


మురసుతోనూ భారీ దెబ్బే..

ఇక మురసు తుఫాను ప్రభావంతో తొమ్మిది జిల్లాల్లో 1,33,351 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతినగా, లక్షా ఎనభై ఆరు వేల మంది రైతులు ప్రభావితమయ్యారు. దీనివల్ల రూ.816 కోట్ల మేర ఆర్థిక నష్టం నమోదైందని, ఎస్‌డీఆర్ఎఫ్ కింద రూ.321 కోట్లు, ఎన్‌డీఆర్ఎఫ్ కింద రూ.266 కోట్లను అంచనా వేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే ఈ తుఫాను కారణంగా ఎనిమిది జిల్లాల్లో 6,748 హెక్టార్ల ఉద్యాన పంటలు దెబ్బతినగా, పన్నెండు వేల మంది రైతులు నష్టపోయారని వివరించారు. అయితే ఇందులో ఇప్పటివరకు 32.77 శాతం మాత్రమే ఎన్యూమరేషన్ పూర్తయిందని, ఇంకా తొమ్మిది వేల మందికి పైగా రైతుల నమోదు పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. వీలైనంత త్వరగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు.

దట్టంగా.. పొగచూరుతున్న ఉత్తరాది!

- **గగనతలంలో వాయుకాలుష్యాన్ని గుర్తించిన నాసా**
- **పంజాబ్, హర్యానా, యూపీలో మరింత ప్రమాదకరం**
- **పంట వ్యర్థాల దహనంతో ముంచుకొస్తున్న ముప్పు**
- **రాజధాని ప్రాంతంలో రాత్రిళ్లు నానా అవస్థలు**

న్యూఢిల్లీ, నవంబర్ 10 (సమయం న్యూస్) : ఉత్తర భారత గగనతలంలో దట్టమైన పొగ కమ్ముకున్న వైనాన్ని అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా) శాటిలైట్లు తాజాగా స్పష్టంగా గుర్తించాయి. ఉత్తరాదిన వాయుకాలుష్య తీవ్రతకు అద్దం పట్టేలా ఉన్న ఈ దృశ్యాల్లో దట్టమైన పొగ అటు ఉత్తర భారతం మీదుగా ఈశాన్య రాష్ట్రాల సరిహద్దుల వరకూ అత్యంత ప్రమాదకరంగా విస్తరించింది. ముఖ్యంగా పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ ప్రాంతాల్లో ఈ పొగ మరింత దట్టంగా కనిపించింది. ఉత్తరాదిన వ్యవసాయ క్షేత్రాల్లో పంటవ్యర్థాలను తగలపెట్టిన ఆనవాళ్లను సైతం నాసా శాటిలైట్లు గుర్తించాయి. ఏటా శీతాకాలంలో పాకిస్థాన్‌తో పాటు ఉత్తర భారతంలో వాయుకాలుష్యం విపరీతంగా పెరుగుతున్న విషయం తెలిసిందే. పంటవ్యర్థాల దహనంతో పాటు వాహనకాలుష్యం, పారిశ్రామిక కాలుష్యం వంటి వాటి కారణంగా గాల్లో దుమ్ముధూళి, పొగ దట్టంగా కమ్ముకుంటోంది. దీనికి తోడు శీతల వాతావరణం, గాలి ప్రవాహం తగ్గడంతో కాలుష్య కారకాలు ఉత్తరాదిన పేరుకుపోయి ప్రజలు పలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ప్రధానంగా జాతీయ రాజధాని ప్రాంతంలో వాయుకాలుష్యం దారుణంగా పెరిగిపోయింది. రాత్రిళ్లు, తెల్లవారుజామున ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. గంగా సింధు నదీ పరీవాహక ప్రాంతంలో సైతం వాయు కాలుష్యం విపరీతంగా పెరిగినట్లు నాసా శాటిలైట్ చిత్రాల్లో కనిపించింది.



దమ్ముంటే.. రిజిస్టర్ చేయించండి!

- **తేజస్వి సూర్యకు మంత్రి ప్రియాంక్ ఖర్గే సవాల్**
- **ఆర్ఎస్ఎస్‌కు లెక్కాపత్రం ఏదీ లేదని విమర్శలు**
- **ప్రముఖుల హత్యల వెనుక ఆ శక్తుల హస్తమే**
- **ఖర్గేపై మండిపడ్డ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య**

బెంగళూరు, నవంబర్ 10 (సమయం న్యూస్): జర్నలిస్టు గౌరీ లంకేశ్, స్కాలర్ ఎంఎం కల్బుర్గి, హేతువాది నరేంద్ర దభోల్కర్ హత్యల వెనుక సంఘ్ పరివార్ హస్తం ఉందని కర్ణాటక హోం మంత్రి ప్రియాంక్ ఖర్గే చేసిన ఆరోపణలు తీవ్ర దుమారం రేపాయి. మూడు రోజుల్లో ఆధారాలు చూపాలని, లేకపోతే ఆయన మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య డిమాండ్ చేశారు. సూర్య చేసిన డిమాండ్‌కు 'ఎక్స్' వేదికగా ఖర్గే ఘాటుగా స్పందించారు. ఆ హత్యలపై సిట్, సీబీఐ జరిపిన విచారణలో నిందితులకు ఆర్ఎస్ఎస్‌తో సంబంధాలున్న రహస్య నెట్‌వర్క్‌లతో లింకులు ఉన్నట్లు వెల్లడైందని ఖర్గే ఆరోపించారు. గోవింద్ పన్సారే హత్య కేసులోనూ ఇలాంటి సంబంధాలు బయటపడ్డాయని ఆయన పేర్కొన్నారు. అలాగే ఆర్ఎస్ఎస్‌కు రిజిస్ట్రేషన్ లేదని, కనీసం సభ్యత్వ వివరాలు, ఆర్థిక లెక్కలు కూడా లేవని ఖర్గే విమర్శించారు. సంస్థను రిజిస్టర్ చేయించే దమ్ము, ధైర్యం ఉందా అని తేజస్వి సూర్యకు ఆయన సవాల్ విసిరారు. రిజిస్ట్రేషన్ ఫీజు తానే చెల్లిస్తానని ఎద్దేవా చేశారు.



తేజస్వి సూర్య కౌంటర్..

అంతకుముందు కేరళలోని కొచ్చిలో ముస్లిం యూత్ లీగ్ రాష్ట్ర సదస్సులో ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. కల్బుర్గి, గౌరీ లంకేశ్, దభోల్కర్ హత్యల వెనుక సంఘ్ పరివార్ వ్యక్తులు ఉన్నారని ఆరోపించారు. ఆ కేసులు విచారణలో ఉన్నాయని, మరో ఆరు నెలల్లో దర్యాప్తు ప్రక్రియను పూర్తి చేసి ఆ హత్యల్లో ప్రమేయమున్న వారందరినీ జైలుకు పంపిస్తానని వ్యాఖ్యానించారు. గాంధీ హత్య వెనుక కూడా అవే శక్తులు ఉన్నాయని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై తేజస్వి సూర్య మండిపడ్డారు. బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి, కేరళ రాజకీయ వేదికలపై ఆరోపణలు చేయడం ఏమిటని సూర్య ప్రశ్నించారు. హోం మంత్రిగా కేసుల విచారణను వేగవంతం చేసి చట్టప్రకారం న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత ఖర్గేపై ఉందన్నారు. న్యాయస్థానాల తీర్పులకు ముందే రాజకీయ వేదికలపై తీర్పులు ప్రకటించడం సరికాదని విమర్శించారు. గౌరీ లంకేశ్ హత్య కేసులో 2018లోనే చార్జిషీటు దాఖలైందని, 2022లో విచారణ ప్రారంభమైందని సూర్య గుర్తుచేశారు. కల్బుర్గి హత్య కేసులో సెప్టెంబరు నాటికి 139 మంది సాక్షుల్లో 33 మంది వాంగ్మూలాలే నమోదు చేశారని, ఈ జాప్యానికి కారణాలేంటో హోం మంత్రి వెల్లడించాలని సూర్య డిమాండ్ చేశారు.



ఉన్నత లక్ష్యాలు.. నేరమా?

సోనియా గాంధీ వ్యాఖ్యలపై శర్మిష్ఠ ముఖర్జీ కౌంటర్

ప్రణబ్ ప్రధాని కావాలనుకుంటే తప్పేంటని ప్రశ్న

మేధోశక్తితో జీవితంలో స్వయంగా పైకి ఎదిగారని వెల్లడి

గాంధీ నెహ్రూ కుటుంబం కాదనే షాకయ్యారా అంటూ సెటైర్

న్యూఢిల్లీ, నవంబర్ 10 (సమయం న్యూస్) : దివంగత నేత, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ప్రధాని కావాలని అనుకున్నట్లు తనకు అనిపించిందని కాంగ్రెస్ సీనియర్ నేత సోనియా గాంధీ తన ఆత్మకథలో ప్రస్తావించిన వైనం ప్రస్తుతం జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ అంశంపై ప్రణబ్ కూతురు శర్మిష్ఠా ముఖర్జీ తాజాగా తీవ్రంగా స్పందించారు. ప్రణబ్ లక్ష్యంపై ఆశ్చర్యపోవాల్సిన పనేమిటని ఆమె సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఆమె పోస్టు పెట్టారు. ప్రధాని పదవికి కావాల్సిన రాజకీయ, పరిపాలన అనుభవం తన తండ్రికి మెండుగా ఉందన్నారు. అద్భుతమైన మేధో శక్తి, కష్టించి పనిచేసే గుణం ఆయన సొంతమని చెప్పారు. 'ప్రధాని కావాలనుకున్నారా?' అని తానూ తన తండ్రిని గతంలో అడిగానని చెప్పారు. సత్తా ఉన్న రాజకీయ నాయకుడు ఎవరైనా ప్రధాని కావాలని కోరుకుంటారని ప్రణబ్ అప్పట్లో బదులిచ్చారని ఆమె గుర్తు చేసుకున్నారు.

అర్హత ఉన్న వ్యక్తి కోరుకుంటే తప్పేంటి?

'ఇందులో ఆశ్చర్యపోవాల్సింది ఏముంది? ఉన్నత లక్ష్యాలు ఉండటం నేరమా? రాజకీయాల్లో, పరిపాలనలో దశాబ్దాల అనుభవం, కష్టపడి పనిచేసే నైజం, మేధోశక్తి ఉన్నప్పుడు ఇందులో తప్పేముంది?' అని శర్మిష్ఠ ప్రశ్నించారు. నా తండ్రి సాధారణ నేపథ్యం నుంచి వచ్చారని, కఠోర శ్రమ, మేధో శక్తి ఆధారంగా జీవితంలో ఉన్నతంగా పైకెదిగారని ఆమె గుర్తుచేశారు. ఎవరూ ఆయనకు ఉన్నత స్థానాలను పళ్లెంలో పెట్టి అందించలేదని చురకలంటించారు. అన్ని అర్హతలు ఉన్న వ్యక్తి ప్రధాని కావాలనుకోవడంలో తప్పేముందని నిలదీశారు. గాంధీ నెహ్రూ కుటుంబానికి చెందని ఓ వ్యక్తి ప్రధాని కావాలనుకోవడమే కాకుండా.. తనకు సంకేతాలు ఇచ్చేందుకు సాహసించడంపై సోనియా షాకయ్యారా? అని ఆమె సెటైర్ వేశారు. 2010లో ప్రణబ్‌తో సంభాషణ గురించి సోనియా తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్'లో పేర్కొన్నారు. అప్పటి ఆర్థికమంత్రి చిదంబరంతో పొసగని వైనంపై ప్రణబ్ తనతో చెప్పారని, పైస్థాయిలో మార్పునకు సమయం వచ్చిందని వ్యాఖ్యానించారని అందులో వెల్లడించారు. దీంతో తాను ఒకింత షాకయ్యానని, ప్రధాని కావాలనే చిరకాల కోరికకు ఆయన వ్యాఖ్యలను సంకేతంగా భావించానని సోనియా తెలిపారు. ఆ తరువాత తాను చర్చను మరోవైపునకు మళ్లించానని కూడా చెప్పారు. అయితే 2012లో యూపీఏ కూటమి తరఫున రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రణబ్ ముఖర్జీని కాంగ్రెస్ ప్రకటించడం, అనంతరం జరిగిన ఎన్నికల్లో ఆయన భారత 13వ రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టడం తెలిసిందే.

ట్రంప్‌పై.. నెతన్యాహు ఒత్తిడి!

ఇరాన్‌పై సైనిక దాడులు ప్రారంభించాలని పట్టుబడుతున్న ఇజ్రాయెల్

ప్రతిరోజూ ఫోన్ చేసి అమెరికా అధ్యక్షుడిని కోరుతున్న వైనం

దౌత్యపరమైన పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్న డొనాల్డ్ ట్రంప్

ఉద్రిక్తతలు పెరగొద్దని తేల్చిచెబుతున్న సౌదీ, ఖతార్, యూఏఈ

ఖేష్మ్ ద్వీపంపై చిన్నపాటి దాడులు చేశామన్న అమెరికా అధ్యక్షుడు

వాషింగ్టన్, నవంబర్ 10 (సమయం న్యూస్) : ఇరాన్‌తో యుద్ధానికి ముగింపు పలికి దౌత్యపరమైన పరిష్కారం దిశగా అడుగులు వేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా యోచిస్తున్నారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాత్రం మరోసారి సైనిక దాడులు ప్రారంభించాలని ట్రంప్‌పై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ట్రంప్‌నకు ప్రతిరోజూ ఫోన్ చేస్తూ ఇరాన్‌పై యుద్ధాన్ని తిరిగి ప్రారంభించాలని ఆయన కోరుతున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అయితే పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరగకుండా చూడాలని సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ సహా పలు దేశాల నేతలు ట్రంప్‌పై ఒత్తిడి తెస్తుండటం ఈ పరిణామాలకు ప్రాధాన్యం సంతరించుకుంది. అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి ఎదురుదెబ్బ తగలడం, ఇరాన్‌పై యుద్ధానికి దేశంలో వ్యతిరేకత పెరుగుతుండటంతో ట్రంప్ తన వైఖరిని మార్చుకున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

మరోవైపు యుద్ధానికి ముగింపు పలికేందుకు చర్చలు జరుగుతున్నప్పటికీ ఇరాన్‌పై అమెరికా పరిమిత స్థాయిలో సైనిక దాడులను కొనసాగిస్తోంది. నవంబర్ మూడు, ఆరు తేదీల్లో ఇరాన్‌లోని ఖేష్మ్ ద్వీపంపై అమెరికా క్షిపణి దాడులు చేసినట్లు తెలుస్తోంది. నవంబర్ ఆరున జరిగిన దాడి గురించి ట్రంప్ నేరుగా ప్రస్తావించకపోయినా అమెరికా మరోసారి దాడి చేసిన విషయాన్ని ఆయన ధ్రువీకరించారు. తాము చిన్నచిన్న దాడులు చేస్తున్నామని, కానీ అవి కచ్చితంగా లక్ష్యాలను దెబ్బతీస్తున్నాయని ఫ్లోరిడాలోని మీడియాతో ట్రంప్ వ్యాఖ్యానించారు. వారు ఒక చిన్న వైమానిక రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేశారని, దాన్ని తాము పదిహేను నిమిషాల్లోనే ధ్వంసం చేశామని వెల్లడించారు. ప్రస్తుతం యథాతథ స్థితిని కొనసాగిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ఇరాన్‌పై దాడులు చేపట్టాలని ట్రంప్‌ను నెతన్యాహు కోరినట్లు వైట్‌హౌస్ అధికారులు తెలిపారని వార్తలు వెలువడ్డాయి. అయితే ట్రంప్ మాత్రం సైనిక చర్యకు తొందరపడకుండా చర్చలకు మరికొంత సమయం ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.



పార్లమెంట్ చరిత్రలో.. కొత్త రికార్డు!



- 89 రోజులుగా ప్రోరోగ్ కాని సమావేశాలు
- నిరవధిక వాయిదాలోనే వర్షాకాల భేటీలు
- 2008 నాటి 87 రోజుల రికార్డు అధిగమింపు
- కీలక బిల్లుల ఆమోదం కోసమేనని ప్రచారం
- డిసెంబర్ 4 నుంచి శీతాకాల సమావేశాలు

న్యూఢిల్లీ, నవంబర్ 10 (సమయం న్యూస్) : పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు నిరవధికంగా వాయిదా పడి నెలలు గడుస్తున్నా, వాటిని అధికారికంగా ముగిస్తూ (ప్రోరోగ్) రాష్ట్రపతి నుంచి ప్రకటన వెలువడకపోవడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఆగస్టు 13న ఉభయ సభలు వాయిదా పడినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రోరోగ్ ఉత్తర్వులు జారీ కాకపోవడంతో పార్లమెంటరీ చరిత్రలో అరుదైన పరిణామం చోటుచేసుకుంది. గతంలో 2008లో నమోదైన 87 రోజుల గరిష్ఠ వ్యవధిని ఈసారి అధిగమించింది. మరోవైపు డిసెంబర్ 4 నుంచి 22 వరకు పదిహేను రోజుల పాటు పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందని సమాచారం.

రాష్ట్రపతి ఉత్తర్వులు అమల్లోనే..

సాధారణంగా లోక్‌సభ, రాజ్యసభలను నిరవధికంగా వాయిదా వేసిన రెండు మూడు రోజుల్లోనే సమావేశాలు ముగిసినట్లు రాష్ట్రపతి నోటిఫికేషన్ విడుదల చేస్తుంటారు. అయితే ఈసారి ఆగస్టు 13 తర్వాత అలాంటి ప్రకటన వెలువడలేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 85(2) కింద రాష్ట్రపతి జారీ చేసిన సమావేశాల నిర్వహణ ఉత్తర్వులు ఇంకా అమల్లోనే ఉన్నట్లు భావిస్తున్నారు. దీంతో కొత్తగా సమావేశాలు నిర్వహించేందుకు రాష్ట్రపతి నుంచి మరోసారి ప్రోరోగ్ ప్రక్రియ అవసరం లేకుండానే పార్లమెంటరీ వ్యవహారాల శాఖ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలుస్తోంది. గతంలో 2008లో అప్పటి యూపీఏ ప్రభుత్వంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై చర్చించేందుకు జూలైలో లోక్‌సభ ప్రత్యేకంగా సమావేశమైంది. అనంతరం సభ నిరవధికంగా వాయిదా పడింది. అయితే 87 రోజుల విరామం తర్వాత అక్టోబర్ 17న తిరిగి సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఆ సమయంలోనూ పార్లమెంట్ సమావేశాలను అధికారికంగా ప్రోరోగ్ చేయలేదు. తాజాగా ఆ రికార్డును అధిగమిస్తూ వర్షాకాల సమావేశాల ముగింపు ప్రకటన లేకుండానే 89 రోజులుగా సుదీర్ఘ విరామం కొనసాగుతోంది.

విపక్షాల తీవ్ర అభ్యంతరం..

మహిళా రిజర్వేషన్ల చట్టం అమలు, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన కీలక బిల్లులను ఆమోదింపజేసుకునేందుకే కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌ను ప్రోరోగ్ చేయకుండా ఉంచిందనే ప్రచారం సాగుతోంది. ఈ అంశాలపై చర్చించేందుకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించే యోచనలో కేంద్రం ఉన్నట్లు సమాచారం. గత బడ్జెట్ సమావేశాల్లో ఏప్రిల్ 17న లోక్‌సభలో ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లు అవసరమైన సంఖ్యాబలం లేకపోవడంతో ఆమోదం పొందలేదు. ఈ బిల్లు ఆమోదం పొందితే లోక్‌సభ సభ్యుల సంఖ్య ప్రస్తుత 543 నుంచి 850కి పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మరోవైపు పార్లమెంట్ సమావేశాల ప్రోరోగ్ వ్యవహారంపై కాంగ్రెస్ సహా ప్రతిపక్ష పార్టీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. డీలిమిటేషన్ బిల్లుకు అవసరమైన మెజారిటీని సమకూర్చుకునే ప్రయత్నంలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తోందని విపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా శీతాకాల సమావేశాల నిర్వహణపై ఈ వారంలో అధికారిక ప్రకటన వెలువడవచ్చని పార్లమెంటరీ వర్గాల సమాచారం.

అమెరికా వీధుల్లో.. చెత్త దీపావళి!

- న్యూజెర్సీలో భారతీయుల పండుగ వేడుకలపై తీవ్ర విమర్శలు
- రోడ్లపై భారీగా పేరుకుపోయిన బాణసంచా వ్యర్థాలు
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం.. రంగంలోకి దిగిన పోలీసులు
- నీటి క్యానన్లతో చెత్తను శుభ్రం చేసిన అగ్నిమాపక సిబ్బంది
- సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన వీడియోలు



వాషింగ్టన్, నవంబర్ 10 (సమయం న్యూస్) : దీపావళి పండుగకు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. పోటాపోటీగా బాణసంచా కాల్చడమూ సాధారణమే. కానీ అమెరికాలోని న్యూజెర్సీలో భారతీయులు జరుపుకొన్న దీపావళి మాత్రం తీవ్ర విమర్శలకు దారితీసింది. న్యూజెర్సీ సిటీ, ఇండియా స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో భారతీయులు రోడ్లు, వీధుల్లో భారీగా బాణసంచా కాల్చారు. ఆ సమయంలో తీవ్రస్థాయిలో ధ్వని, వాయు కాలుష్యం జరుగుతోందన్న ఆగ్రహం స్థానికుల నుంచి వ్యక్తమైంది. రాకపోకలకు అంతరాయం కలగడంతో పోలీసులు రంగంలోకి దిగి జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. భారతీయులు కాల్చిన బాణసంచా వ్యర్థాలు, బూడిద, అట్టపెట్టెలు, ఇతర చెత్తతో రోడ్లన్నీ పూర్తిగా నిండిపోయాయి.

ఆ చెత్త తొలగింపు, రోడ్లు, వీధులను శుభ్రం చేయడం అక్కడి అధికారులకు పెద్ద సమస్యగా మారింది. చివరకు అగ్నిమాపక శకటాలను తీసుకొచ్చి అత్యంత శక్తివంతమైన నీటి క్యానన్ల ద్వారా శుభ్రం చేశారు. దీనంతటినీ చూడడానికి జనం భారీగా గుమికూడటంతో పోలీసులు మళ్లీ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. ఇందుకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఇది విదేశాల్లో భారతీయ పండుగల నిర్వహణ, పౌర స్పృహపై తీవ్ర చర్చకు దారితీసింది. భారతీయులు ప్రాచీన సంస్కృతి గురించి మాట్లాడుతున్నారే తప్ప ఒక దేశంలో అతిథులుగా ఉంటున్నామన్న సంగతిని పూర్తిగా మరిచిపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తాయి. ఇలాగే చేస్తే అందర్నీ అమెరికా నుంచి మూకుమ్మడిగా పంపించివేయడం ఖాయమంటూ ఘాటు వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

తిరిగి వస్తే.. ఉరే గతి!

- బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ప్రాసిక్యూటర్ హెచ్చరిక
- గడువు ముగియడంతో అప్పీల్ చేసుకునే అవకాశం లేదని వెల్లడి
- విద్యార్థుల తిరుగుబాటు అణచివేత కేసులో మరణశిక్ష ఖరారు
- డిసెంబర్‌లో స్వదేశానికి వస్తానంటున్న మాజీ ప్రధాని
- హసీనాను అప్పగించాలని భారత్‌ను కోరుతున్న బంగ్లాదేశ్



ఢాకా, నవంబర్ 10 (సమయం న్యూస్): బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ఒకవేళ మళ్లీ దేశానికి తిరిగివస్తే ఆమెకు విధించిన మరణశిక్షను అమలు చేయడం తప్ప మరో మార్గం లేదని ఆ దేశ ప్రాసిక్యూటర్ స్పష్టం చేశారు. 2024లో విద్యార్థుల ఆధ్వర్యంలో జరిగిన ప్రజా తిరుగుబాటును దారుణంగా అణచివేసినందుకు గాను ఆమెపై దాఖలైన మానవహక్కుల ఉల్లంఘనల కేసులో అక్కడి కోర్టు ఆమెకు మరణశిక్ష విధించిన సంగతి తెలిసిందే. భారత్‌లో తలదాచుకుంటున్న షేక్ హసీనా డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌కు తిరిగిరావాలని భావిస్తున్నట్లు వార్తలు రావడంతో ప్రాసిక్యూటర్ ఎమ్‌డీ అమీనుల్ ఇస్లామ్ తాజాగా స్పందించారు. చట్ట ప్రకారం తీర్పు వెలువడిన ముప్పై రోజుల్లోగా అప్పీల్ చేసుకోవాల్సి ఉంటుందని, ఆ గడువు ఇప్పటికే ముగియడంతో హసీనాకు ఎలాంటి చట్టపరమైన అవకాశాలు మిగలలేదని ఆయన స్పష్టం చేశారు. షేక్ హసీనా ముందున్న ఏకైక మార్గం కోర్టు విధించిన మరణశిక్ష తీర్పును ఎదుర్కోవడమేనని ఆయన తేల్చిచెప్పారు.

గతేడాది నవంబర్‌లో ఢాకాలోని కోర్టు ఆమె గైర్హాజరీలోనే విచారణ జరిపి, హత్యలకు ఉసిగొల్పడం, దాడులను అడ్డుకోకపోవడం వంటి మూడు ప్రధాన నేరాలపై దోషిగా తేలుస్తూ మరణశిక్షను ఖరారు చేసింది. అయితే ఈ విచారణ ఓ నాటకమని హసీనా అభివర్ణించారు. తాను తిరిగి వస్తే ఉరిశిక్ష ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిసినప్పటికీ డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌కు తిరిగివస్తానని ఆమె ప్రకటించారు. ప్రజల పట్ల తనకున్న బాధ్యతను భయం ఏమాత్రం నిర్ణయించలేదని ఆమె పేర్కొన్నారు. 2024 ఆగస్టులో వేలాది మంది నిరసనకారులు ప్రధాని నివాసాన్ని ముట్టడించడంతో పదిహేనేళ్ల ఆమె పాలన అంతమైంది. ఆ సమయంలో ఆమె హెలికాప్టర్‌లో భారత్‌కు పారిపోయి వచ్చి ఇక్కడే తలదాచుకుంటున్నారు. యునైటెడ్ నేషన్స్ గణాంకాల ప్రకారం ఆ నిరసనల అణచివేతలో సుమారు 1,400 మంది ప్రాణాలు కోల్పోయారు. కాగా హసీనాను తమకు అప్పగించాలని బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ భారత్‌ను కోరింది. ఈ అభ్యర్థన ప్రస్తుతం న్యాయ సమీక్షలో ఉందని భారత ప్రభుత్వం తెలిపింది.

సెహ్వాగ్ విధ్వంసం.. సెమీస్‌కు భారత్!

అండర్-19 ఆసియా కప్‌లో టీమిండియా జోరు



- యూఏఈపై 70 పరుగుల తేడాతో ఘన విజయం
- 160 పరుగులతో చెలరేగిన ఆర్యవీర్ సెహ్వాగ్
- 17 ఫోర్లు, 7 సిక్సర్లతో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడిన యువ సంచలనం
- మూడో వికెట్‌కు వినీత్‌తో కలిసి 193 పరుగుల భారీ భాగస్వామ్యం
- నాలుగు వికెట్లతో యూఏఈని దెబ్బతీసిన ఇషాన్ సూద్

అల్ అమరాత్ (ఒమన్), నవంబర్ 10 (సమయం న్యూస్): అండర్-19 ఆసియా కప్ క్రికెట్ టోర్నమెంట్‌లో భారత యువ జట్టు విజయపరంపర కొనసాగిస్తోంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)తో జరిగిన కీలక పోరులో భారత్ 70 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. యువ బ్యాటర్ ఆర్యవీర్ సెహ్వాగ్ విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. 17ఫోర్లు, ఏడు సిక్సర్లతో 160 పరుగులు చేసి భారత విజయంలో కీలకపాత్ర పోషించాడు. అతడికి వి.కె. వినీత్ అండగా నిలవడంతో భారత్ నిర్ణీత 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 309 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం 310 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన యూఏఈ 239 పరుగులకే పరిమితమైంది. భారత బౌలర్ ఇషాన్ సూద్ నాలుగు వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బతీశాడు. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. కెప్టెన్ లక్ష్య రాజేష్ రాయ్‌చందాని 17 పరుగుల వద్ద వెనుదిరిగాడు. అయితే ఆర్యవీర్ సెహ్వాగ్ క్రీజులో నిలదొక్కుకుని ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ప్రారంభంలో ఆచితూచి ఆడిన అతడు ఆ తర్వాత దూకుడు పెంచాడు. ప్రత్యర్థి బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా బౌండరీల వర్షం కురిపించాడు. మైదానం నలువైపులా ఆకర్షణీయమైన షాట్లతో పరుగులు రాబట్టాడు. అతడి బ్యాటింగ్ ధాటికి యూఏఈ బౌలర్లు పరుగులను నియంత్రించలేకపోయారు. ఆర్యవీర్‌కు వి.కె. వినీత్ చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరూ కలిసి మూడో వికెట్‌కు 193 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఒకవైపు ఆర్యవీర్ భారీ షాట్లతో విరుచుకుపడుతుండగా, మరోవైపు వినీత్ బాధ్యతాయుతంగా బ్యాటింగ్ చేశాడు. 67 పరుగులతో జట్టు భారీ స్కోరు సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. ఈ జోడీని విడదీయడానికి యూఏఈ బౌలర్లు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. చివరకు నశీమ్ ఖాన్ వీరిద్దరినీ పెవిలియన్‌కు పంపించాడు. ఆర్యవీర్ సెహ్వాగ్ తన ఇన్నింగ్స్‌లో 160 పరుగులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. అతడి బ్యాట్ నుంచి 17 ఫోర్లు, ఏడు భారీ సిక్సర్లు వచ్చాయి. బౌండరీల రూపంలోనే 110 పరుగులు సాధించడం అతడి దూకుడుకు నిదర్శనంగా నిలిచింది. ప్రత్యర్థి బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శిస్తూ భారత ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేశాడు. అతడి అద్భుత ఇన్నింగ్స్‌తో భారత్ భారీ స్కోరు దిశగా దూసుకెళ్లింది. ఆర్యవీర్, వినీత్ కీలక భాగస్వామ్యం అనంతరం భారత బ్యాటర్లు స్కోరును మరింత పెంచేందుకు ప్రయత్నించారు. చివర్లో యశ్‌వర్ధన్ చౌహాన్ 17 పరుగులు, అన్వయ్ ద్రావిడ్ 12 పరుగులు చేశారు. దీంతో భారత్ నిర్ణీత 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 309 పరుగులు సాధించి యూఏఈ ముందు 310 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. భారీ లక్ష్య ఛేదనలో యూఏఈ బ్యాటర్లు పోరాడినప్పటికీ భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కోలేకపోయారు. అహ్మద్ ఖుదాదాద్ 74 పరుగులతో జట్టులో అత్యధిక స్కోరు సాధించాడు. నూర్‌ఉల్లా అయోబీ 39 పరుగులు, యాపిన్ రాయ్ 29 పరుగులు, కెప్టెన్ అయాన్ మిస్బా 27 పరుగులతో సహకరించారు. అయితే కీలక సమయాల్లో వికెట్లు కోల్పోవడంతో లక్ష్య ఛేదన కష్టంగా మారింది. చివరకు యూఏఈ 239 పరుగులకే పరిమితమై ఓటమి చవిచూసింది. భారత బౌలర్లలో ఇషాన్ సూద్ అద్భుత ప్రదర్శన చేశాడు. కీలక సమయాల్లో నాలుగు వికెట్లు పడగొట్టి యూఏఈ బ్యాటింగ్‌ను దెబ్బతీశాడు. ఇతర బౌలర్లు కూడా సహకరించడంతో ప్రత్యర్థి జట్టు లక్ష్యానికి దూరంగా నిలిచిపోయింది. బ్యాటింగ్‌లో ఆర్యవీర్ సెహ్వాగ్, బౌలింగ్‌లో ఇషాన్ సూద్ భారత విజయానికి ప్రధాన కారకులయ్యారు. ఈ విజయంతో అండర్--19 ఆసియా కప్ సెమీఫైనల్‌లో భారత్ తన స్థానాన్ని ఖరారు చేసుకున్నట్లు అందించిన మ్యాచ్ వివరాలు పేర్కొంటున్నాయి. ఆర్యవీర్ సెహ్వాగ్ భారీ ఇన్నింగ్స్, వినీత్ కీలక భాగస్వామ్యం, ఇషాన్ సూద్ బౌలింగ్ ప్రదర్శన జట్టుకు విజయాన్ని అందించాయి. తదుపరి పోరులోనూ ఇదే జోరు కొనసాగించాలని భారత యువ జట్టు భావిస్తోంది.



సమాజ్‌వాది పార్టీ ఎంపీని పెళ్లి చేసుకోబోతున్న క్రికెటర్ రింకూ సింగ్

క్రికెటర్ రింకూ సింగ్ త్వరలో ఓ ఇంటివాడు కాబోతున్నాడు. ఓ మహిళా ఎంపీని ఆయన పెళ్లి చేసుకోబోతున్నాడు. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ప్రియ సరోజ్‌తో రింకూ సింగ్ వివాహం జరుగనుంది. డిసెంబర్ 4న లక్నోలో వారి వివాహ వేడుక జరగనుంది. పెళ్లి ఏర్పాట్లు కూడా మొదలయ్యాయి. క్రికెట్, బాలీవుడ్, వ్యాపార, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులను వివాహానికి ఆహ్వానించనున్నారు. ప్రియ సరోజ్ ఇప్పటికే తమ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌ను కలిసి వివాహానికి ఆహ్వానిస్తూ శుభలేఖ అందించారు. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ని రింకూ సింగ్ కుటుంబంతో కలిసి తమ వివాహానికి ఆహ్వానిస్తారని సమాచారం. ప్రియ సరోజ్ 2024 ఎన్నికల్లో మచిలీషహర్ నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. ఆమె ఆర్ట్స్, న్యాయవాద విద్యలో డిగ్రీలు పూర్తి చేసింది. ప్రియతో రింకూ నిశ్చితార్థం గత ఏడాది జూన్ నెలలో జరిగింది.

ఐపీఎల్‌లోకి మరో రెండు జట్లు.. ఇక క్రికెట్ పండగే!

- 2028 నుంచి 12 జట్లతో ఐపీఎల్ నిర్వహణకు కసరత్తు?
- కొత్త జట్ల రేసులో పూణే, వడోదర నగరాల పేర్లు
- ఒక్కో జట్టు విలువ రూ.వేల కోట్లకు చేరే అవకాశం
- దేశీయ, విదేశీ పెట్టుబడిదారుల నుంచి భారీ ఆసక్తి
- కొత్త ప్రసార హక్కుల కాలానికి అనుగుణంగా విస్తరణ యోచన
- మ్యాచ్‌ల సంఖ్య, ఆటగాళ్ల లభ్యతపై బీసీసీఐ దృష్టి



ముంబయి, నవంబర్ 10 (సమయం న్యూస్): ప్రపంచంలోనే అత్యంత ఆదరణ పొందిన క్రికెట్ లీగ్‌లలో ఒకటైన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) అభిమానులకు మరో ఆసక్తికర వార్త వినిపిస్తోంది. ప్రస్తుతం పది జట్లతో జరుగుతున్న ఈ మెగా క్రికెట్ సమరంలోకి మరో రెండు కొత్త జట్లను తీసుకురావాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. 2028 సీజన్ నుంచి మొత్తం 12 జట్లతో ఐపీఎల్‌ను నిర్వహించే అవకాశాలను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) పరిశీలిస్తున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. కొత్త ఫ్రాంచైజీల కోసం మహారాష్ట్రలోని పూణే, గుజరాత్‌లోని వడోదర నగరాల పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే ఐపీఎల్‌లో మ్యాచ్‌ల సంఖ్య పెరగడంతోపాటు మరింత మంది యువ క్రికెటర్లకు అవకాశాలు లభించే వీలుంది. అయితే కొత్త జట్ల చేరికపై బీసీసీఐ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఐపీఎల్‌ను మరింత విస్తరించాలనే ఆలోచనలో భాగంగా 2028 సీజన్ నుంచి రెండు కొత్త ఫ్రాంచైజీలను చేర్చే అవకాశాలపై చర్చ జరుగుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం లీగ్‌లో పది జట్లు పాల్గొంటుండగా, మరో రెండు జట్లు చేరితే వాటి సంఖ్య 12కు పెరుగుతుంది. దీంతో లీగ్ పరిధి మరింత విస్తరించడంతోపాటు కొత్త నగరాలకు ఐపీఎల్ ప్రాతినిధ్యం లభించే అవకాశం ఉంటుంది. అయితే ఈ ప్రతిపాదన ఇంకా ప్రాథమిక చర్చల దశలోనే ఉన్నట్లు తెలుస్తోంది. కొత్త జట్ల కోసం పూణే, వడోదర నగరాల పేర్లు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. గుజరాత్‌ను ప్రముఖ క్రీడా కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ప్రయత్నాల నేపథ్యంలో వడోదర పేరు ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటికే గుజరాత్ టైటాన్స్ రూపంలో ఆ రాష్ట్రానికి ఐపీఎల్‌లో ప్రాతినిధ్యం ఉంది. మరోవైపు పూణే నగరానికి ఐపీఎల్‌తో గతంలోనే అనుబంధం ఉంది. పూణే వారియర్స్ ఇండియా, రైజింగ్ పూణే సూపర్‌జెయింట్ జట్లు గతంలో ఈ నగరం నుంచి లీగ్‌లో పాల్గొన్నాయి. దీంతో పూణేలో క్రికెట్‌కు ఉన్న ఆదరణ, మౌలిక వసతులు కొత్త ఫ్రాంచైజీ ఏర్పాటుకు అనుకూలంగా ఉండవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఐపీఎల్ ఫ్రాంచైజీలకు అంతర్జాతీయ స్థాయిలో పెరుగుతున్న ఆదరణ నేపథ్యంలో కొత్త జట్ల కొనుగోలుకు భారీ పోటీ నెలకొనే అవకాశముందని అంచనాలు వినిపిస్తున్నాయి. ఒక్కో కొత్త ఫ్రాంచైజీ విలువ ఒక బిలియన్ అమెరికా డాలర్లకు మించి ఉండవచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నట్లు కథనాలు పేర్కొంటున్నాయి. భారతీయ వ్యాపార సంస్థలతోపాటు యూరప్, పశ్చిమాసియా ప్రాంతాలకు చెందిన పెట్టుబడి సంస్థలు కూడా ఐపీఎల్‌పై ఆసక్తి చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే కొత్త జట్ల వేలం, కనీస ధర, పెట్టుబడిదారుల వివరాలపై ఇప్పటివరకు అధికారిక స్పష్టత లేదు. 2028 నుంచి 2032 వరకు ఉండే తదుపరి ప్రసార హక్కుల కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఐపీఎల్ విస్తరణపై ఆలోచనలు జరుగుతున్నట్లు సమాచారం. కొత్త జట్లు చేరితే మ్యాచ్‌ల సంఖ్య పెరిగే అవకాశముండటంతో ప్రసార హక్కుల విలువపైనా ప్రభావం పడవచ్చని భావిస్తున్నారు. అయితే మ్యాచ్‌ల సంఖ్య పెరగడం వల్ల లీగ్ నిర్వహణకు అదనపు సమయం అవసరమవుతుంది. అంతర్జాతీయ క్రికెట్ పోటీలతో సమన్వయం చేసుకోవడం, ప్రసారకర్తల ఆసక్తి, ఆదాయ పంపిణీ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఐపీఎల్‌లో చివరిసారిగా 2022 సీజన్‌లో రెండు కొత్త జట్లు ప్రవేశించాయి. లక్నో సూపర్ జెయింట్స్, గుజరాత్ టైటాన్స్ చేరికతో లీగ్‌లో జట్ల సంఖ్య ఎనిమిది నుంచి పదికి పెరిగింది. ఈ విస్తరణతో మరింత మంది ఆటగాళ్లకు అవకాశాలు లభించడంతోపాటు కొత్త అభిమాన వర్గాలు లీగ్‌తో అనుసంధానమయ్యాయి. ఇప్పుడు మరో రెండు జట్లను చేర్చే ప్రతిపాదన అమలైతే ఐపీఎల్ మరింత విస్తృత స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది. కొత్త జట్ల చేరిక అనేది కేవలం పెట్టుబడులు, ఫ్రాంచైజీల కొనుగోలుతో ముగిసే అంశం కాదు. మొత్తం మ్యాచ్‌ల సంఖ్య, లీగ్ నిర్వహణకు అవసరమైన రోజులు, దేశీయ క్రికెట్ పోటీలపై ప్రభావం, అంతర్జాతీయ ఆటగాళ్ల లభ్యత వంటి అంశాలు కీలకంగా మారనున్నాయి. జట్ల సంఖ్య పెరిగితే ఆటగాళ్ల ఎంపిక విధానం, వేలం ప్రక్రియ, జట్లలో ఆటగాళ్ల సంఖ్య వంటి అంశాల్లోనూ మార్పులు అవసరమయ్యే అవకాశం ఉంది. ఈ అంశాలన్నింటినీ పరిశీలించిన తర్వాతే విస్తరణపై తుది నిర్ణయం తీసుకునే వీలుంది. కొత్త జట్ల చేరికకు సంబంధించిన ప్రచారం క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. ముఖ్యంగా పూణే, వడోదర నగరాలకు ప్రాతినిధ్యం లభిస్తుందా అనే అంశంపై చర్చ జరుగుతోంది. మరో రెండు జట్లు చేరితే కొత్త ఆటగాళ్లకు అవకాశాలు పెరగడంతోపాటు ఐపీఎల్ పోటీ మరింత విస్తరించే అవకాశం ఉందని భావిస్తున్నారు.



టోర్నీలోనే సరికొత్త రికార్డు!

బ్యాటింగ్‌లో వీరవిహారం చేసిన ఆర్యవీర్ సెహ్వాగ్..

దుబాయ్, నవంబర్ 10 (సమయం న్యూస్): యూఏఈతో జరిగిన ఏసీసీ మెన్స్ అండర్-19 ఆసియా కప్ మ్యాచ్‌లో భారత యువ సంచలనం, భారత మాజీ దిగ్గజ ఓపెనర్ వీరేందర్ సెహ్వాగ్ కుమారుడు ఆర్యవీర్ సెహ్వాగ్ అద్భుతమైన డబుల్ సెంచరీ స్థాయి ఇన్నింగ్స్ (160 పరుగులు)తో చెలరేగిపోయాడు. పాకిస్థాన్‌తో జరిగిన మునుపటి మ్యాచ్‌లో భారత్ ఓటమి పాలైన తర్వాత మళ్లీ ఫామ్‌లోకి రావడానికి ఈ మ్యాచ్ అత్యంత కీలకమైంది. అటువంటి తీవ్రమైన ఒత్తిడి సమయంలో ఆర్యవీర్ అత్యంత బాధ్యతాయుతమైన ఆటతీరుతో జట్టును విజయతీరాలకు చేర్చాడు. పిచ్ పరిస్థితులు బ్యాటింగ్‌కు అనుకూలంగా లేని సమయంలో ఆర్యవీర్ ఎంతో పరిణతితో బ్యాటింగ్ చేశాడు. ఆరంభంలో బంతి సీమ్ అవ్వడం, స్పిన్ కావడం, అదనంగా నెమ్మదించడంతో అతను చాలా జాగ్రత్తగా ఆడాడు. తొలి గంటలో పిచ్ నుంచి తీవ్రమైన సవాలు ఎదురైనప్పటికీ, ఓపికగా క్రీజులో నిలబడి 69 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. ఆ తర్వాత పిచ్ కుదురుకోవడంతో తన షాట్ల విన్యాసాలను ప్రారంభించాడు. ముఖ్యంగా స్పిన్నర్లు రంగంలోకి దిగిన తర్వాత తన మార్క్ ఆధిపత్యం ప్రదర్శించాడు. క్రీజు వెలుపలికి వచ్చి కవర్స్ మీదుగా భారీ సిక్సర్లు కొట్టడం, లోపలికి వచ్చే బంతులను లాంగ్-ఆన్, లెగ్ సైడ్ వైపు స్లాగ్-స్వీప్ చేయడం ద్వారా పరుగుల వేగాన్ని పెంచాడు. మొత్తంగా 131 బంతుల్లో సెంచరీ చేరుకున్న ఆర్యవీర్, ఆ తర్వాత మరింత విరుచుకుపడ్డాడు. యూఏఈ స్పిన్నర్ ఉద్దిష్ సూరి వేసిన ఒకే ఓవర్‌లో 21 పరుగులు రాబట్టి ఆధిపత్యాన్ని పూర్తిస్థాయిలో చేజిక్కించుకున్నాడు. 160 బంతుల్లో 150 పరుగుల మైలురాయిని దాటిన అతను, చివరికి 45వ ఓవర్‌లో 160 పరుగుల వద్ద పెవిలియన్‌కు చేరాడు. అతని ఇన్నింగ్స్‌లో 17 ఫోర్లు, 7 సిక్సర్లు ఉన్నాయి. ఇది ఈ టోర్నీలోనే ఒక బ్యాటర్ నమోదు చేసిన అత్యధిక వ్యక్తిగత స్కోరు కావడం గమనార్హం. మరోవైపు వి.కె. వినీత్ (60 బంతుల్లో అర్ధసెంచరీ) కూడా అద్భుతమైన సహకారం అందించడంతో భారత్ భారీ స్కోరు సాధించింది. తండ్రి వీరేందర్ సెహ్వాగ్ శైలికి భిన్నంగా ఆర్యవీర్ సాంప్రదాయక ఓపెనర్‌గా కనిపించాడు. క్రీజును పూర్తిగా వాడుకుంటూ, ప్రారంభంలో ఒత్తిడిని తట్టుకుని, ఆ తర్వాత ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడే అతని శైలి అందరినీ ఆకట్టుకుంది. తండ్రి 'స్టాండ్ అండ్ డెలివర్' పద్ధతికి కాస్త దూరంగా ఉన్నప్పటికీ, పరుగులు రాబట్టడంలో తండ్రికి తగ్గ తనయుడిగా నిరూపించుకున్నాడు.

పవన్ కల్యాణ్- అన్నా లెజినోవా వైవాహిక బంధంపై చర్చ..

ఆమె ఆస్తులు రూ. 1,800 కోట్లా!



అమరావతి, నవంబర్ 10 (సమయం న్యూస్): ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కీలక వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో, రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పవన్ కల్యాణ్, ఆయన భార్య అన్నా లెజినోవా తమ 13 ఏళ్ల సుదీర్ఘ వైవాహిక బంధానికి అధికారికంగా ముగింపు పలుకుతున్నట్లు ప్రకటించారు. పరస్పర అంగీకారం, అవగాహన, గౌరవంతో విడిపోవాలని తాము నిర్ణయించుకున్నట్లు ఇద్దరూ ఉమ్మడిగా ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. భార్యాభర్తలుగా తమ ప్రయాణం ముగిసినప్పటికీ, ఇకపై మంచి స్నేహితులుగా కొనసాగుతామని స్పష్టం చేశారు. ఈ వార్త పవన్ కల్యాణ్ అభిమానులను, పార్టీ శ్రేణులను తీవ్ర ఆశ్చర్యానికి గురిచేసింది. పవన్ కల్యాణ్, అన్నా లెజినోవా 2013 సెప్టెంబర్ 30న వివాహ బంధంతో ఒక్కటయ్యారు. అప్పటి నుంచి వీరిద్దరూ తమ వ్యక్తిగత జీవితాన్ని మీడియా దృష్టికి దూరంగా ఉంచుతూ వచ్చారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్ కాగా, కుమార్తె పొలెనా అంజనా పవనోవా కూడా ఉన్నారు. పరస్పర అంగీకారంతో విడిపోతున్నప్పటికీ, పిల్లల భవిష్యత్తు, సంతోషం, శ్రేయస్సుకే తమ మొదటి ప్రాధాన్యత అని, వారి పెంపకంలో బాధ్యతాయుతమైన తల్లిదండ్రులుగా కలిసి ఉంటామని వెల్లడించారు. ఈ క్లిష్ట సమయంలో తమ వ్యక్తిగత ప్రైవసీని గౌరవించాలని మీడియాను, అభిమానులను కోరారు. 'తీన్ మార్' పరిచయం నుంచి రూ. 1,800 కోట్లకు పైగా ఆస్తుల ప్రచారం వరకు రష్యాకు చెందిన అన్నా లెజినోవా మోడల్‌గా, నటిగా గుర్తింపు పొందారు. 2011లో విడుదలైన పవన్ కల్యాణ్ చిత్రం 'తీన్ మార్' షూటింగ్ సమయంలో వీరిద్దరికీ మొదటిసారి పరిచయం ఏర్పడింది. ఆ సినిమాలో అన్నా ఒక చిన్న పాత్రలో కనిపించారు. ఆ పరిచయం క్రమంగా ప్రేమగా మారి 2013లో వివాహానికి దారితీసింది. విద్యాపరంగా, వ్యాపారపరంగా కూడా అన్నా లెజినోవా ప్రత్యేక గుర్తింపు సాధించినట్లు సమాచారం. 2024లో సింగపూర్ నేషనల్ యూనివర్సిటీ నుంచి మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీని పొందినట్లు కథనాలు వచ్చాయి. అంతేకాకుండా, హాస్పిటాలిటీ రంగంపై ఆసక్తితో సింగపూర్, రష్యాల్లోని ప్రముఖ హోటళ్లు, వ్యాపారాలలో ఆమెకు భాగస్వామ్యాలు ఉన్నాయని తెలుస్తోంది. కొన్ని అంతర్జాతీయ కథనాలు, నివేదికల ప్రకారం రష్యా, సింగపూర్‌లలో ఆమెకు సుమారు రూ. 1,800 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్లు విపరీతంగా ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ ఆస్తుల విలువ లేదా యాజమాన్య హక్కులపై అన్నా లెజినోవా తరఫు నుంచి కానీ, పవన్ కల్యాణ్ బృందం నుంచి కానీ ఎలాంటి అధికారిక ధృవీకరణ లేదా స్పష్టత వెలువడలేదు.



దీపావళి అయిపోయినా అర్ధరాత్రి పేల్చడం ఏంటి..

'ఇతరులను హింసించకండి' అంటూ రేణూ ఘాటు వ్యాఖ్యలు!

హైదరాబాద్, నవంబర్ 10 (సమయం న్యూస్): దీపావళి పండుగ ముగిసినప్పటికీ అర్ధరాత్రి వేళల్లో భారీ శబ్దాలు వచ్చే టపాసులు కాల్చడంపై ప్రముఖ నటి రేణూ దేశాయ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎదుటివారి ఇబ్బందులను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరించడం మూర్ఖత్వమేనని మండిపడ్డారు. సోషల్ మీడియా వేదికగా ఆమె పెట్టిన సుదీర్ఘ పోస్ట్ ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పండుగను ఆనందంగా జరుపుకోవడంలో తప్పులేదని, అయితే ఆ ఆనందం ఇతరులకు ఇబ్బందిగా మారకూడదని హితవు పలికారు. దీపావళి సమయంలో టపాసుల శబ్దాలపై తాను వెంటనే స్పందించకపోవడానికి గల కారణాన్ని కూడా వెల్లడించారు. పండుగ రోజున ఈ విషయంపై మాట్లాడితే తనను హిందూ వ్యతిరేకిగా ముద్ర వేసే అవకాశం ఉందని భావించి మౌనంగా ఉన్నట్లు తెలిపారు. పండుగ పూర్తయిన తర్వాత కూడా అర్ధరాత్రి వేళల్లో భారీ శబ్దాలతో టపాసులు కాల్చడంపై ఆమె గట్టిగా ప్రశ్నించారు. రాత్రి 11 గంటలవుతున్నా ప్రజలు ఇంకా పెద్ద శబ్దాలు వచ్చే టపాసులు కాలుస్తూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీపావళి రోజున తాను ఏమైనా మాట్లాడి ఉంటే తనను హిందూ వ్యతిరేకి అని ముద్ర వేసేవారని, అందుకే ఆ రోజు మౌనంగా ఉండిపోయానని పేర్కొన్నారు. కానీ పండుగ అయిపోయిన తర్వాత కూడా రాత్రి 11 గంటలకు ఇంత పెద్ద శబ్దాలతో టపాసులు కాల్చడానికి ఇప్పుడు ఏ పండుగ ఉందంటూ నిరసన వ్యక్తం చేశారు. టపాసుల భారీ శబ్దాల వల్ల సమాజంలో ఎదురయ్యే తీవ్ర సమస్యలను కూడా రేణూ దేశాయ్ ప్రస్తావించారు. ప్రతి ఒక్కరూ తమ ఆనందం గురించి మాత్రమే ఆలోచిస్తూ, చుట్టుపక్కల ఉన్న వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారి ఇబ్బందులను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతరుల బాధలను అర్థం చేసుకోకపోవడం, కనీస సానుభూతి చూపించకపోవడం సరికాదన్నారు. దీపావళి అనేది దీపాల పండుగ అని, దానిని శబ్దాల పోటీగా మార్చకూడదని సూచించారు. వేడుకల కారణంగా పక్కవారికి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు. టపాసులు కాల్చడంపై ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని, కనీసం రాత్రి 10 గంటలలోపే టపాసులు కాల్చడం పూర్తి చేసి ప్రజలను ప్రశాంతంగా నిద్రపోనివ్వాలని విజ్ఞప్తి చేశారు. తమ సరదా కోసం ఇతరులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని స్పష్టం చేశారు. మీ ఆనందం కోసం తోటి మనుషులను హింసించకండి, కొంచెం దయ చూపించండి అంటూ విజ్ఞప్తి చేశారు. పండుగల సమయంలో వ్యక్తిగత ఆనందంతో పాటు సామాజిక బాధ్యత కూడా గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. ఏడాదిలోని 364 రోజుల పాటు వాహనాలు, పరిశ్రమల వల్ల కాలుష్యం ఉంటోందని, దాని గురించి ప్రత్యేకంగా మాట్లాడి ప్రయోజనం లేదని అభిప్రాయపడిన ఆమె, టపాసుల విషయంలో ఇతరులకు కలిగే ఇబ్బందులను గుర్తించడం ముఖ్యమని వెల్లడించారు.

అలా జరగడం కూడా మంచిదే..

ఎన్నో పాఠాలు నేర్చుకున్నా: సమంత!



హైదరాబాద్, నవంబర్ 10 (సమయం న్యూస్): జీవితంలో పొందే విజయాల కంటే ఎదురయ్యే అపజయాలే అత్యధిక పాఠాలు నేర్పిస్తాయని ప్రముఖ కథానాయిక సమంత వ్యాఖ్యానించారు. తాజాగా ఓ ప్రత్యేక షోలో పాల్గొన్న ఆమె, వ్యాపార రంగంలో తనకు ఎదురైన తొలి వైఫల్యాలను, అనుభవాలను గుర్తుచేసుకున్నారు. ఆ ఓటమి తనకు ఎన్నో నేర్పిందని చెప్పారు. "నా తొలి వ్యాపార భాగస్వామ్యం ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. అయితే, మొదటిసారి పెట్టుబడి పెట్టిన వ్యాపారం విఫలమవడం కూడా మంచిదే. ఎందుకంటే, విజయాల కంటే అపజయాలే ఎక్కువ నేర్పిస్తాయి. నా జీవితంలో నేర్చుకున్న పాఠాలన్నీ వైఫల్యాల నుంచి వచ్చినవే. విజయాలు నాకు పెద్దగా ఏమీ నేర్పించలేదు" అని సమంత స్పష్టం చేశారు. ఇదే వేదికపై వ్యాపార రంగంలో మహిళలు ఎదుర్కొంటున్న విభిన్న సవాళ్లపైనా ఆమె మాట్లాడారు. "కొత్తగా ఏదైనా ప్రారంభించాలంటే మహిళల్లో భయం ఎక్కువగా ఉంటుంది. మహిళా పారిశ్రామికవేత్తలతో కలిసి పనిచేయడం నాకు ఎంతో కొత్త అనుభూతినిచ్చింది. ఇప్పటివరకు నేను దాదాపు 8 నుంచి 10 వ్యాపార సంస్థల్లో పెట్టుబడులు పెట్టాను. వాటిలో ఎనిమిది సంస్థలకు మహిళలే వ్యవస్థాపకులుగా ఉండడం ఎంతో సంతోషకరమైన విషయం" అని తెలిపారు. కాగా, త్వరలో తొలి బిడ్డకు జన్మనివ్వనున్న సమంత, ప్రస్తుతం 'సెలబ్రిటీ మాస్టర్‌షెఫ్ తమిళం' షోకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు.

ఒకే ఏడాదిలో 3 సినిమాలు హిట్..

సూర్య రికార్డు



ఓ అగ్ర కథానాయకుడు ఒకే ఏడాదిలో మూడు సినిమాల్లో నటించడం, ఆ మూడూ హిట్ కావడమంటే విశేషమే కదా. ప్రముఖ నటుడు సూర్యకు అలాంటి ఘనతే దక్కబోతోంది. ఒకే ఏడాదిలో రూ.200 కోట్లు వసూలు చేసిన మూడు చిత్రాల్లో నటించిన తమిళ హీరోగా అతిత్వరలో ఆయన రికార్డు సృష్టించబోతున్నారు. ఈ ఏడాది మే నెలలో సూర్య నటించిన కరుప్పు (వీరభద్రుడు), ఆగస్టులో విశ్వనాథ్ అండ్ సన్స్ విడదల కాగా, దీపావళి కానుకగా సీన్ చిత్రం ప్రేక్షకుల ముందుకొచ్చింది. కరుప్పు, విశ్వనాథ్ అండ్ సన్స్ సూపర్ హిట్ చిత్రాలుగా నిలవగా, సీన్ కూడా ప్రేక్షకాదరణతో మంచి వసూళ్లు రాబట్టుతోంది. కరుప్పు ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.310 కోట్లు వసూలు చేయగా, విశ్వనాథ్ అండ్ సన్స్‌కు రూ.209 కోట్లు వచ్చాయి. 'సీన్' ఇప్పటివరకూ రూ.154 కోట్లు సాధించింది. ప్రస్తుతం ఆ చిత్రానికి వస్తున్న స్పందనను చూస్తే, ఈ వారాంతానికి రూ.200 కోట్లు వసూలు చేయడం ఖాయమని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు. అంటే త్వరలోనే ఆయనకు ఈ ఏడాదిలో రూ.200 కోట్లు వసూళ్లు అందించిన మూడో చిత్రంగా 'సీన్' నిలవబోతోంది.

త్వరలో పెళ్లిపీటలెక్కనున్న ఇరుముడి హీరోయిన్

చెన్నై, నవంబర్ 10 (సమయం న్యూస్): తమిళ చిత్ర పరిశ్రమలో 'ఇరుముడి' సహా పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక ప్రియా భవానీ శంకర్ త్వరలోనే వైవాహిక జీవితంలోకి అడుగుపెట్టబోతోంది. గత కొన్నేళ్లుగా తన ప్రియుడు రాజ్‌వెల్ రాజ్‌తో గాఢమైన ప్రేమలో ఉన్న ఈ భామ, త్వరలోనే అతడితో ఏడడుగులు వేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. తాజాగా ప్రియా తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసిన కొన్ని ప్రత్యేకమైన ఫోటోలు ఈ పెళ్లి వార్తలకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. దీంతో అభిమానులు, నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా ఈ జంటకు ముందస్తు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ప్రియా భవానీ శంకర్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో కొన్ని ప్రత్యేక ఫోటోలను అభిమానులతో పంచుకున్నారు. ఆ ఫోటోల్లో ఆమె సాంప్రదాయ దుస్తుల్లో ఎంతో ముచ్చటగా కనిపించడమే కాకుండా, మెడలో మల్లెపూల దండలు ధరించి కనిపించారు. అంతేకాకుండా చేతులకు అందంగా గోరింటాకు పెట్టుకున్న దృశ్యాలను కూడా షేర్ చేశారు. ఈ ఫోటోలు చూస్తుంటే ఆమె ఇంట్లో పెళ్లి వేడుకలకు సంబంధించిన ముందస్తు సందడి మొదలైనట్లు అభిమానులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల మధ్య ఈ వేడుకలు ప్రారంభమైనట్లు సమాచారం. అయితే ఇవి అధికారికంగా ప్రీ వెడ్డింగ్ వేడుకల ఫోటోలేనా లేదా పెళ్లి తేదీ ఎప్పుడు అనే అంశాలపై ప్రియా భవానీ శంకర్ నుంచి స్పష్టత రావాల్సి ఉంది. ప్రియా భవానీ శంకర్, రాజ్‌వెల్ రాజ్ ప్రేమకథ విషయానికి వస్తే వీరిద్దరికీ కాలేజీ రోజుల నుంచే గాఢమైన పరిచయం ఉంది. ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారడంతో అప్పటి నుంచి ఇద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకుంటూ తమ బంధాన్ని కొనసాగిస్తున్నారు. దాదాపు పదేళ్లకు పైగా ప్రేమ ప్రయాణం సాగిస్తున్న ఈ జంట, తమ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను ఎక్కువగా గోప్యంగానే ఉంచుతూ వచ్చారు. 2022లోనే ఈ జంట కలిసి తమ కలల ఇంటిని కొనుగోలు చేయడం అప్పట్లో చిత్రసీమలో చర్చనీయాంశంగా మారింది. అప్పటి నుంచి వీరి పెళ్లి ఎప్పుడు జరుగుతుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం వినిపిస్తున్న కథనాల ప్రకారం, ప్రియా భవానీ శంకర్ తన ప్రియుడు రాజ్‌వెల్ రాజ్‌ను కుటుంబ సభ్యులు, అత్యంత ఆత్మీయుల సమక్షంలో వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నారట. ఎలాంటి భారీ హంగామా లేకుండా, అత్యంత సంప్రదాయ పద్ధతిలో ఈ వేడుకను నిర్వహించేందుకు ఇరు కుటుంబాలు సన్నాహాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఇప్పటివరకు పెళ్లి తేదీ, వివాహ వేదికకు సంబంధించిన వివరాలను ఈ జంట అధికారికంగా ప్రకటించలేదు.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at NUTAN OFFSET PRINTERS, R.S.NO. 434, PLOT NO 16,17, AUTO NAGAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520007. Ediotr: **MOHAMMED MURTHUZA,** PRGI No:APTEL/26/A3949, www.samayam.net Mobile No. **7036644111, 9490140565**